సిద్ధం.. నరకం !

ట్రాఫిక్ జామ్‌తో జనం అవస్థలు

మండిన ఎండతో కార్యకర్తల అగచాట్లు

బస్సులు లేక గంటల తరబడి ప్రయాణికుల పాట్లు

సీఎం మాట్లాడుతుండగా వెనుదిరిగిన కార్యకర్తలు.. ఏర్పాట్లలో ఘోరంగా విఫలమైన నిర్వాహకులు





ఏలూరు-ఆంధ్రజ్యోతి/దెందులూరు/ఏలూరు రూరల్/టూ టౌన్/క్రైం, ఫిబ్రవరి 3 : వైసీపీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పార్టీ శ్రేణులతో ఏర్పాటుచేసిన 'సిద్ధం' సభతో జనం నరకం చూశారు. సభకు వేలాది బస్సులు, కార్లు, బైక్‌లను వినియోగించి.. లక్షల్లో జనాన్ని తీసుకువస్తున్నామని చెప్పినప్పటికీ ఆ సంఖ్యలో రాలేదు. అయినప్పటికీ వచ్చిన వారికి సైతం సరైన వసతులు కల్పించడంలో నిర్వాహకులు ఘోర వైఫల్యం చవిచూశారు. ఓ వైపు ఎండ, మరోవైపు తాగునీటి కొరత, ఇంకో కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్‌తో అందరూ ఇబ్బందులు పడ్డారు.

మండే ఎండలో ఒంటి కాలిపై..

సిద్ధం సభ నిర్వహణలో పార్టీ అధిష్ఠానం ఘోరంగా విఫలమైంది. ఫలితంగా పార్టీ శ్రేణులతోపాటు ప్రజలు, పోలీసులు నరకం చూశారు. దెందులూరు నియోజకవర్గం పరిధిలోని ఏలూరు నగర శివారు పాలగూడెంలో జాతీయ రహదారికి ఆనుకొని సహారాకు చెందిన స్థలంలో సభను ఏర్పాటుచేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన పార్టీ శ్రేణులు, ప్రజలను సమీకరించారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి సభా ప్రాంగణంలోకి పంపించారు. సమావేశం సాయంత్రం నాలుగు గంటలకు మొదలై ఐదున్నర వరకు సాగింది. ఎండ విపరీతంగా ఉండడంతో వీరంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలో నీడపట్టున ఉండగా కార్యకర్తలు ఎండలో మాడిపోయారు. సభా వేదిక వద్ద వీఐపీలు, స్థానిక ప్రజా ప్రతినిధులకు కొద్ది సంఖ్యలో కుర్చీలు ఏర్పాటు చేయగా వచ్చిన కార్యకర్తలు ఎండలో ఒంటి కాలిపై నిల్చోవాల్సి వచ్చింది. నీడకోసం కార్యకర్తలు వెతుకులాడారు. పేపర్లు, కర్చీఫ్‌లు తలకు అడ్డం పెట్టుకున్నారు. చివరకు మంచినీళ్ల కోసం ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఏలూరు, దెందులూరు తదితర ప్రాంతాల నుంచి వెళ్లిన కేడర్ వెనుతిరిగి ఇంటి ముఖం పట్టింది. చాలామంది పోలీసులు, నాయకులు అలా వెళ్లే వారిని ఆపాలని చూడగా, తాము వెళ్లడం లేదని, మళ్లీ వస్తామని చెబుతూనే వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయారు.కార్యకర్తలను తరలించిన బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కొందరు మద్యం మత్తులో జోగుతూ కనిపించారు. సభలో సీఎం మాట్లాడటం ప్రారంభించగానే వందల సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు, మహిళలు తిరుగుముఖం పట్టారు. కొందరిని పోలీసులు ఆపివేశారు. సీఎం మాట్లాడడం పూర్తయ్యే సరికి సగం మంది వెళ్లిపోయారు. వచ్చిన జనానికి అందించేందుకు తెచ్చిన మజ్జిగ ప్యాకెట్లను కొందరు భుజాలపై వేసుకుని తీసుకెళ్లిపోయారు.



సీఎం ప్రసంగిస్తుండగా వెనుదిరిగిన ప్రజలు

సభకు రాకపోతే పథకాలు కట్..

'జగన్ సభకు మీరంతా తప్పనిసరిగా రావాలి. లేకుంటే పథకాలు రద్దు చేస్తాం' అంటూ వైసీపీ నాయకులు ప్రజలను బెదిరించి మరీ సభకు లాక్కెళ్లారు. వైసీపీ నాయకులకు అధిష్ఠానం టార్గెట్‌లు విధించి ఒక్కో నాయకుడు ఇంత మంది జనాన్ని తీసుకురావాలని హుకుం జారీచేశారు. ఏలూరు నగరంలోని ప్రతీ డివిజన్‌కు రెండు పాఠశాలల బస్సులను కేటాయించారు. వలంటీర్ల సాయంతో ఇంటింటికీ తిరిగి బలవంతంగా బస్సులు ఎక్కించారు. ఒక్కొక్కరికి రూ.300 నుంచి రూ.500 ఇవ్వడంతో పాటు పలావు ప్యాకెట్, పులిహోర ప్యాకెట్, మగ వారికి మద్యం అందించారు. టూ వీలర్స్‌కు, ఆటోలకు, ఇతర వాహనాలకు పెట్రోలు ట్యాంకులు నింపి మరీ తీసుకెళ్లారు. అడుగడుగున వైసీపీ జెండాలతో నగర వాసులకు ఆటంకాలు కల్పించారు. కామవరపుకోట మండలంలో ఒక్కొక్కరికి బిర్యానీ ప్యాకెట్, రూ.100 నుంచి రూ.300 వరకు డబ్బులు ఇచ్చారు.



పాపం.. పోలీసులు

సీఎం సభకు భారీస్థాయిలో వచ్చిన పోలీసులకు కనీసం భోజనాలు కూడా సక్రమంగా అందక ఆకలితో అలమటించారు. సభా ప్రాంగణంలో మూడు రోజుల నుంచి పలువురు మహిళా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. బాత్ రూంలు సరిపడా ఏర్పాటు చేయకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సభకు ముందురోజు పోలీసులకు భోజనాలు అందించే సమయానికి కొంత మంది వైసీపీ నేతలు వచ్చి భోజనాల పార్శిల్స్‌ను తీసుకుపోవడంతో చాలా మంది పోలీసు సిబ్బంది ఆకలితోనే అలమటించారు. ఈ నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని శనివారం భోజనాల వ్యాన్ రాగానే కానిస్టేబుళ్లు, హోంగార్డులు పార్శిల్స్ కోసం ఎగబడ్డారు. భోజనం చేసేందుకు కనీసం చెట్లు గాని నీడ గాని లేకపోవడంతో నిలబడి కొంతమంది, వాహనాల మీద, మోటారు సైకిల్ మీద పెట్టుకుని చెత్త చెదారాల వద్ద తిన్నారు. ఎండలో విధులు నిర్వహిస్తున్న తమకు కనీసం భోజనాలు సరిగ్గా ఇవ్వలేదని కొంతమంది పోలీసులు బహిరంగంగానే వ్యాఖ్యానించారు.

టీడీపీ నేతల హౌస్ అరెస్టు

సీఎం సిద్ధం సభను అడ్డుకుంటారని భావించి దెందులూరు మండలంలోని పలువురు టీడీపీ నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. దెందులూరులో టీడీపీ నేత పెనుబోయిన మహేష్ యాదవ్‌ను ఎస్ఐ స్వామి, పోలీసు సిబ్బంది హౌస్ అరెస్టు చేశారు. మహేష్ యాదవ్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని భయపడి టీడీపీ నేతలను హౌస్ అరెస్టు చేస్తున్నారని విమర్శించారు.

కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

ఏలూరు సమీపంలో సహారా వెంచర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభతో ప్రజలు నరకయాతన అనుభవించారు. 16వ నెంబర్ జాతీయ రహదారిపై వెళ్ళే వారే కాకుండా ఏలూరు నగరం నుంచి వెళ్లే వారు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి గంటల తరబడి అక్కడే ఉండాల్సి వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఆశ్రం ఆసుపత్రి వద్ద నుంచి గుండుగొలను బ్రిడ్జి వరకూ ట్రాఫిక్ అస్తవ్యస్తంగానే ఉంది. చివరకు పోలీసులు రంగంలోకి దిగి ఎంత ప్రయత్నించినా ట్రాఫిక్ క్లియర్ కాలేదు. ఏలూరు నుంచి గుండుగొలను వైపు వెళ్ళే ప్రయాణీకులు తమ వాహనాలతో ట్రాఫిక్‌లో చిక్కుబడిపోయారు. రాత్రి తొమ్మిది గంటల వరకూ ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉంది. దీంతో దూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల ప్రయాణీకులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సభకు వచ్చిన అనేక మంది తమ వాహనాలు ఎక్కడ ఉన్నాయో తెలియక జాతీయ రహదారిపైనే ఉండిపోయారు. దీంతో పోలీసులు వారిని పక్కకు జరగాలంటూ చెబుతూ అలిసిపోయారు. ఆశ్రం ఆసుపత్రికి వచ్చే పలువురు రోగులు ఇబ్బందులు పడ్డారు. రావడానికి, వెళ్ళడానికి ఎలాంటి ఆస్కారం లేకపోయింది. అనేక మంది స్కూలు, కళాశాలల పిల్లలు తమ ఇళ్ళకు వెళ్ళడానికి ఆ మార్గంలో అవకాశం లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూనే వాహనాల్లో ఉండిపోయారు. ఆకలితో అల్లాడిపోయారు. జాతీయ రహదారి పక్కనే మీటింగ్ పెట్టడమేమిటని ప్రజలను ఇబ్బంది పెట్టడానికే ఇలా చేశారంటూ వైసీపీ వారిపై పలువురు ప్రయాణీకులు విమర్శించారు.



ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన జనం.. వాహనాలు..
రాత్రి తొమ్మిది గంటలైనా క్లియర్‌కాని ట్రాఫిక్

మీడియాపై దాడి

'సిద్ధం' సభ కవరేజీ కోసం వెళ్లిన మీడియా ప్రతినిధులపై వైసీపీ కార్యకర్తలు దాడిచేశారు. మీడియా కోసం ఏర్పాటు చేసిన పాయింట్ వద్దకు ఆ పార్టీ కార్యకర్తలు దూసుకెళ్లారు. అభ్యంతరం చెప్పిన మీడియాపై కార్యకర్తలు దురుసుగా ప్రవర్తిస్తూ, నోటికొచ్చినట్లుగా మాట్లాడి వాగ్వివాదానికి తెరతీశారు. మీడియా వ్యక్తుల గొంతులు పట్టుకుని దాడులకు దిగారు. చివరకు పోలీసులు అడ్డుకున్నారు. సీఎం జగన్ సమక్షంలో మీడియా ప్రతినిధులపై వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడటాన్ని ఏలూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి ఖండించారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాలపై దాడులు జరుగుతున్నాయని, దాడికి పాల్పడ్డ వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడిని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఖండించారు. జగన్ సర్కార్‌ను ప్రజలు ఛీకొట్టే రోజులు ఆ పార్టీకి దగ్గర్లోనే ఉన్నాయన్నారు. మీడియా ప్రతినిధులకు సీఎం బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



లోపలకు వెళ్లాలంటూ కార్యకర్తలకు ఎస్పీ ప్రశాంతి సూచనలు

ప్రభుత్వ ప్రతినిధులా.. పార్టీ కార్యకర్తలా ?

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రజలకు సేవలందించేందుకంటూ జగన్ సర్కార్ వలంటీర్ వ్యవస్థను తెరపైకి తెచ్చింది. వారికి ప్రతి నెలా ఐదు వేల రూపాయలు ప్రభుత్వ సొమ్మును ఇస్తోంది. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు, వారికి ఇటు అధికారులకు మధ్య వారధి ఉంటుందని ప్రభుత్వం చెప్పుకొచ్చింది. కాని, వారిని వైసీపీ కార్యక్రమాలకు వినియోగించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే దీనిపై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేసినా జగన్ సర్కార్ లెక్క చేయడం లేదు. తాజాగా ఏలూరులో నిర్వహించిన జగన్ సిద్ధం సభకు వలంటీర్లు తప్పనిసరిగా హాజరుకావాలంటూ పార్టీ ఆదేశాలు ఇచ్చింది. వారు రాని పక్షంలో ఒక్కో వలంటీర్ ఇద్దరు వ్యక్తులను సభకు తరలించాలని సూచించారు. దీంతో ఉమ్మడి పశ్చిమలోని వలంటీర్లలో ఎక్కువ మంది సిద్ధం సభకు వెళ్లారు. ఇలా పార్టీ ప్రతి కార్యక్రమంలోనూ వలంటీర్లను వినియోగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు సంక్షేమ పథకాల పేరుతో వలంటీర్లను పార్టీ కార్యక్రమాలకు పరోక్షంగా వినియోగించుకునేవారు. క్షేత్రస్థాయిలో గ్రామాలు, పట్టణ వార్డుల్లో వైసీపీ ఇన్‌చార్జ్‌లతో కలిసి ఇంటింటికి వెళుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళుతున్నారు. బూత్ ఇన్‌చార్జ్‌లు, వార్డ్ ఇన్‌చార్జ్‌లతో కలిసి వాలంటీర్లు ఇంటిం టికి వెళ్లిన సందర్భాలున్నాయి. పార్టీకి ఉపయోగపడే విధంగా ప్రజలు, ఓటర్ల డేటాను సేకరించడంలోనూ వలంటీర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలోనే ఇంటింటికి తిరిగి వివరాలను సేకరించారు. కుటుంబ సభ్యుల పేర్లను నమోదుచేశారు. ప్రతి వ్యక్తి వివరాలను వలంటీర్ల ద్వారా పార్టీ సేకరించింది. ఆ మొత్తం వివరాలను హైదరాబాద్‌లోని ప్రత్యేక ఏజెన్సీ ద్వారా పర్యవేక్షిస్తుందంటూ ప్రతిపక్షాలు ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేశాయి. తాజాగా కులగణన వివరాలు సేకరణ బాధ్యతను వలంటీర్లపైనే పెట్టింది. పర్యవేక్షణకు ప్రభుత్వ సిబ్బందిని వినియోగిస్తు న్నారు. ప్రభుత్వం పేరుతో పార్టీకి ప్రయోజనం చేకూర్చే సేవలను వలంటీర్ల ద్వారా నిర్వహిస్తోంది. వైసీపీకి అనుకూలంగా లేని వలంటీర్లను తొలగిస్తున్నారు. ఇటీవల పెనుగొండలో ఒకేసారి 20 మందిని తొలగించడం ఉదాహరణ.

బస్సులు లేక ప్రయాణికుల పాట్లు



సీఎం సిద్ధం సభకు ఉమ్మడి పశ్చిమ గోదావరిలోని ఏలూరు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి అధిక సంఖ్యలో బస్సులను తరలించారు. దీంతో అయా ప్రాంతాల్లో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. బస్సుల కోసం బస్టాండ్‌లలో గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. వీరి సంగతిని పట్టించుకోకుండా కేవలం తమ పార్టీ సభకు మాత్రమే ప్రాముఖ్యమిస్తూ ఏడు డిపోల్లో 200కు పైగా బస్సులను జగన్ సభకు తరలించడంపై ప్రజలు మండిపడుతున్నారు. మరోవైపు మారుమూల ప్రాంతాలకు చెందిన బస్సు సర్వీసులు అధికంగా రద్దయ్యాయి. జనం ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడంతో వారు అడిగినంత సొమ్ములు ముట్టచెప్పాల్సి వచ్చింది.



ఏలూరు బస్టాండ్



చింతలపూడిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మాగంటి బాబు, తదితరులు

చింతలపూడికి రేపు

రా..కదలిరా

చంద్రబాబు భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు

చింతలపూడి/ఉంగుటూరు, ఫిబ్రవరి 3 : ఏలూరు జిల్లా చింతలపూడిలో ఈ నెల 5న జరగనున్న 'రా.. కదలిరా' టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొనే బహిరంగ సభకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మూడు రోజులుగా ప్రాంగణం ఎంపిక, హెలిపాడ్ స్థలం ఎంపికతోపాటు సభా నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. భారీ స్టేజీ, బారికేడ్ల నిర్మాణం, సభకు వెనుక భాగంలో హెలిపాడ్ నిర్మాణ కాంక్రీట్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పార్కింగ్ ఏర్పాటుకు స్థలాలు చదును చేస్తున్నారు. చంద్రబాబు సభను విజయవంతం చేయడానికి నాయకులు ఏర్పాట్లు చూస్తున్నారు. ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి ఈ సభకు లక్షకు పైగా కార్యకర్తలు, ప్రజలు హాజరు కానున్నారు. ఆయా ప్రాంతాల్లోని నాయకులు గ్రామస్థాయి నుంచి కార్యకర్తలు, నాయకులను కలిసి సభకు కదిలి రావాలంటూ పిలుపునిస్తున్నారు.

జగన్ పాలనలో ఏదీ అభివృద్ధి

జగన్ పాలనలో రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి జరగలేదని మాజీ మంత్రి మాగంటి బాబు విమర్శించారు. చింతలపూడిలో జరిగే రా.. కదలిరా సభ ఏర్పాట్లను ఆయన శనివారం పర్యవేక్షించి మాట్లాడారు. 'చింతలపూడి నియోజక వర్గమంటేనే చంద్రబాబుకు, లోకేశ్‌కు, పవన్ కల్యాణ్‌లకు ఎంతో ఇష్టం. ఇక్కడ ఏ సభ జరిగినా విజయవంతంగా జరుగుతుంది. జిల్లాలో గతంలో నిర్వహించిన ఇదేం ఖర్మ, యువగళం పాదయాత్రలు ఇక్కడి నుంచే ప్రారంభించి విజయవం తంగా నిర్వహించారు. సభకు లక్షా 40 వేల మంది వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం' అని తెలిపారు. నియోజకవర్గ పరిశీలకుడు కోళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ రా.. కదలిరా సభకు ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు తరలివస్తారని తెలిపారు. ఎన్నికల శంఖారావం ఇక్కడి నుంచే ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఆర్డీవో పరిశీలన

చింతలపూడిలో రా.. కదలిరా సభకు చంద్రబాబు దిగుతున్న హెలిపాడ్ ప్రాంతాన్ని నూజివీడు ఆర్డీవో భవాని శంకరి శనివారం సాయంత్రం పర్యవేక్షించారు. స్థానిక అధికారులు, నిర్వాహకులతో మాట్లాడి వివరాలను తెలుసుకుని పరిశీలించారు. స్థానిక నాయకులు మాటూరి వెంకట్రామయ్య, కోండ్రు దేవ, కె.రాజశేఖరరెడ్డి, శ్రీనివాసరావు, లీలాప్రశాంతి, పల్లె శ్రీను, స్థానిక కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

పార్టీ గెలుపు ప్రతి ఒక్కరి బాధ్యత : దేవినేని

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు పిలుపునిచ్చారు. చింతలపూడి రా కదలిరా సభ విజయవంతం చేసేందుకు శనివారం ఉంగుటూరు పాతూరి కల్యాణ మండపంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఉమా మాట్లాడుతూ వైసీపీ పాలనతో జనం విసిగిపోయారని, సీఎం జగన్‌ను ఇంటికి పంపడం ఖాయమన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని గంజాయాంధ్ర ప్రదేశ్‌గా మార్చి నిరుద్యోగులను మోసం చేసిన ఘనత జగన్‌దేనని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో జనం జగన్‌ను ఇంటికి పంపడం ఖాయమన్నారు. మళ్లీ తెలుగు దేశం పార్టీ విజయం సాధించడం తథ్యమన్నారు. ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దేవినేని

పరీక్ష ముగిసిన వెంటనే మార్కుల నమోదు : డీవీఈవో

- రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు



ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 : సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఇంట ర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను నమోదు చేయడంలో ఈ ఏడాది నుంచి ఇంటర్ బోర్డు మార్పులు చేసిందని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి, పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకరరావు వెల్లడించారు. సెయింట్ థెరిస్సా బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహణపై జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల జూనియర్ లెక్చరర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఒకేషనల్ ప్రాక్టికల్స్ 5 నుంచి, జనరల్ ప్రాక్టికల్స్ పరీక్షలు 11వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ఇప్పటివరకు ప్రాక్టికల్స్ పరీక్షలకు విద్యార్థులు సాధించిన మార్కులను మాన్యువల్‌గా నమోదు చేసేవారు. ఈ విధానం స్థానే ఏ రోజుకా రోజు పరీక్ష ముగిసిన వెంటనే విద్యార్థి సాధించిన మార్కులను ఎగ్జామినర్ ఆన్‌లైన్ విధానంలో నమోదు చేయాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ముందు కూర్చుని మార్కులు నమోదు చేయాలి. ఈ ప్రక్రియను చిత్రీకరించే సీసీ కెమెరాలను జిల్లా కేంద్రంలో ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా నేరుగా పరిశీలిస్తుంటాం. పారదర్శకత కోసమే నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ప్రాక్టికల్ పరీక్షలన్నీ సంబంధిత కళాశాలలోనే సెల్ఫ్ సెంటర్లలో జరుగుతాయి. జిల్లాలో 69 సెంటర్లు జనరల్ ప్రాక్టికల్స్‌కు, 29 సెంటర్లు ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు ఏర్పాటు చేశాం' అని తెలిపారు. జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ) సభ్యులు కె.యోహాన్, ఎ.నాగేశ్వరరావు, ఎం.పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంక్రిమెంట్ వార్



- సచివాలయ ఆరోగ్య సెక్రటరీలకు ఎంఎల్‌హెచ్‌పీల మధ్య వివాదం
- 2015 నుంచి పెండింగ్ వర్కులన్నీ హెల్త్ సెక్రటరీలకే అప్పగింత
- శ్రమభారం మాది.. ఫలితం వారికా.. అంటూ ఆవేదన



భీమవరం, ఫిబ్రవరి 3 : వైద్య ఆరోగ్య శాఖలో రెండు విభాగాల ఉద్యోగుల మధ్య ఇంక్రిమెంట్ వివాదం నెలకొంది. ప్రజలకు వైద్య సేవలతోపాటు, రికార్డు పనులన్నీ తాము చేస్తుంటే ఆయుష్మాన్ భారత్‌లో చేరిన ఎంఎల్‌హెచ్‌పీలకు తాజాగా ఏడు వేల 500 రూపాయలు ఇన్‌సెంటీవ్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని హెల్త్ సెక్రటరీలు మండిపడుతున్నారు. 2019లో సచివాలయ వ్యవస్థ ప్రారంభమైనప్పుడు నవంబరులో వార్డు, గ్రామ హెల్త్ సెక్రటరీలు విధులు చేపట్టారు. సచివాలయాల పరిధిలో ఉండే ప్రజా వైద్యానికి సంబంధించిన అంశాలను వీరే నిర్వహిస్తున్నారు. దీనితోపాటు ఆర్‌సీహెచ్ పోర్టర్లు ఎంట్రీ చేసే పనుల బాధ్యత వీరిదే. వీరి తర్వాత ఆయుష్మాన్ భారత్ పథకంలో గ్రామస్థాయిలో ఎంఎల్‌హెచ్‌పీలను నియమించింది. వీరికి నెల వారీ వేతనం రూ.40 వేలుగా నిర్ణయించింది. ఇంతవరకు వైద్యారోగ్య శాఖలో పనిచేసే ఏఎన్ఎంలకు అదనంగా ఇటు హెల్త్ సెక్రటరీలు, ఎంఎల్‌హెచ్‌పీలు జత కలిశారు. ప్రభుత్వం ప్రజాసేవతోపాటు పలు రకాల యాప్‌ల ద్వారా సమాచారాన్ని ఆన్‌లైన్ చేసే ప్రక్రియ చేపట్టడంతో అందరికి పనిభారం పెరిగింది.

అయితే కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించి వైద్య సేవలకు చెందిన సేవల మొత్తాన్ని సింహభాగం హెల్త్ సెక్రటరీలకే అప్పగించారు. ఎంఎల్‌హెచ్‌పీలకు అప్పగించే కొన్ని ఆన్‌లైన్ పనులలో కేవైసీలను చేయడంలో హెల్త్ సెక్రటరీలకు పనిభారం పెంచారు. ఈ పరిస్థితుల్లో ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఎంఎల్‌హెచ్‌పీలకు 7 వేల 500 రూపాయలు ఇన్‌సెంటీవ్‌గా ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. పైగా ఇటువంటి ఆన్‌లైన్ ప్రక్రియ వారి బాధ్యత అంటూ పేర్కొన్నారు. విధులలో భాగంగా అత్యధిక కార్యక్రమాలన్నీ తాము చేస్తుంటే ఇంక్రిమెంట్ వారికి ఇవ్వడంపై హెల్త్ సెక్రటరీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ కొంత కాలంగా ప్రభుత్వ అధికారుల దృష్టికి వినతి పత్రాల రూపంలో తీసుకెళ్లారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో హెల్త్ సెక్రటరీలు సుమారు వెయ్యి మందికి పైగా ఉన్నారు. వీరందరూ గ్రామీణ స్థాయిలో వైద్య సేవలందిస్తున్నారు. ప్రభుత్వం తమకు తక్కువ జీతం చెల్లిస్తూ ఇంకా ఇంక్రిమెంట్‌లు పెంచలేదన్న ఆవేదనను తొలి దశలో మండల పరిషత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు ఇంక్రిమెంట్ ఎంఎల్‌హెచ్‌పీలకే దక్కడంతో ఈ మహిళా ఉద్యోగులందరూ ఆందోళనకు సిద్ధపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గత నెల 31న తమ సమస్యలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు వినతి పత్రం అందించారు.

మరో మెలిక ఏమిటంటే హెల్త్ సెక్రటరీ ఉద్యోగం పొందిన వారు సింహభాగం అంతకు ముందు పది నుంచి 15 ఏళ్లపాటు కాంట్రాక్టు ఏఎన్ఎంలుగా విధులు నిర్వహించారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తర్వాత వారు నిర్వహించిన పరీక్షల్లో విజయం సాధించి ఉద్యోగం పొందినప్పటికీ ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం కారణంగా వారు ఈ విధుల్లో చేరడానికి ఆలస్యమైంది. నెల రోజుల తర్వాత సర్వీసులో చేరారు. ఈ విధంగా ఒక నెల జాప్యం వల్ల అందరూ అక్టోబరులో చేరితే ఈ బ్యాచ్ నవంబరులో బాధ్యతలు చేపట్టింది. ఇలా ఒక నెల సర్వీసు కోల్పోయామని, హెల్త్ సెక్రటరీలే అధికారులను కోరారు. ఇప్పుడు ఇన్‌సెంటీవ్‌లు తమందరికీ ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తూ అధికారులను కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

న్యాయం చేయాలి

ఇంక్రిమెంట్ విషయంలో హెల్త్ సెక్రటరీలకు అన్యాయం జరిగింది. పని విషయంలో ఎంఎల్‌హెచ్‌పీల కంటే అదనపు సేవలందిస్తున్నాం. కాబట్టి మాకు ఇంక్రిమెంట్ అందించాలి.

\- స్నేహలత, హెల్త్ సెక్రటరీల సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు

6న సర్పంచ్‌ల చలో అసెంబ్లీ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 3: సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6వ తేదీన సర్పంచ్‌లో అమరావతి చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం గౌరవ సలహాదారు, జిల్లా సర్పంచ్‌ల సంఘం గౌరవ అధ్యక్షుడు పిల్లి సత్యరాజు తెలిపారు. విలేఖర్ల సమావేశంలో అయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, కేంద్రం పంచాయతీలకు ఇచ్చిన సుమారు రూ.7 వేలకోట్లు ఇవ్వకుండా దారి మళ్ళించిందని మండిపడ్డారు. ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు కడలి గోపాలరావు మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులను పంచాయతీలకు విడుదల చేయాలని, పంచాయతీ సర్పంచ్‌ల చేతే అభివృద్ధి పనులు చేయించాలన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు మాట్లాడుతూ పంచాయతీల ఆధీనంలోనే గ్రామ సచివాలయాలు, వలంటీర్లను పనిచేయించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వాడుకున్న నిధులను తిరిగి పంచాయతీలకు చెల్లించాలని కోరుతూ 6వ తేదీన చేపట్టిన చలో అసెంబ్లీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సత్యనారాయణ, సునీత, సురేష్, ఏసురత్నం, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వెబ్‌సైట్లలో వైద్యసిబ్బంది సెలక్షన్ జాబితా

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 : ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ (రాజమహేంద్రవరం)పరిధిలోని జోన్-2లో కాంట్రాక్టు ప్రాతిపదికన ఎంఎల్‌హెచ్‌పీ /సీహెచ్‌వో ఉద్యోగ నియామకాలకు జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన అనంతరం అభ్యర్థుల ఫైనల్ సెలక్షన్ జాబితా సంబంధిత జిల్లాల అధికారిక వెబ్‌సైట్లలో పొందుపర్చినట్టు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పి.పద్మాశశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 5న ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని తమ కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు. జాబితాలను eluru.ap.gov.in లేదా westgodavari.ap.gov.in వెబ్‌సైట్ల నుంచి తెలుసుకోవచ్చున న్నారు.

వాసవిలో గేట్ పరీక్ష



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 3: గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్టిన్ ఇంజనీరింగ్ (గేట్) ప్రవేశపరీక్ష మండలంలోని పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పరీక్షకు ఉదయం 138 మందికి 103 మంది, సాయంత్రం 230 మందికి 215 మంది హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపల్ రత్నాకరరావు తెలిపారు.పరీక్షా కేంద్రం కో-ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్‌లు పరీక్షలను పర్యవేక్షించారు.

జానకీరామ్‌కు లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డు



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 3: తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్న గూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి జానకీ రామ్ రాజస్థాన్‌లోని జోబినార్‌లో జరిగిన ఇండియన్ హార్టీకల్చర్ సమ్మిట్‌లో లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. మూడు రోజుల పాటు సరిగిన ఈ సమ్మిట్‌లో రాజస్థాన్‌లోని శ్రీకరన్ నరేంద్ర అగ్రికల్చర్ యూనివర్శిటీతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకున్నారు. జానకీరామ్ సారధ్యంలో రిజిస్ట్రార్ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు హాజరయ్యారు. జానకీరామ్‌కు అభినందనలు తెలిపారు.

నా పాటలకు ప్రేరణ పాపికొండలే..

సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్



పోలవరం, ఫిబ్రవరి 3 : "పాపికొండలు, గోదావరి ప్రశాంతతకు నిలయాలు..14 ఏళ్ల వయసులో పాపికొండల విహారానికి వెళ్లాను. తర్వాత ఇటీవల ఒకసారి వెళ్ళాను.. నేను ఎక్కడున్నా కళ్లు మూసుకుని అక్కడి జ్ఞాపకాలు ఒక్కసారి నెమరు వేసుకుంటే మనసు నిర్మలమై ప్రశాంతత కలుగుతుంది. ఆ ఉత్సాహంతో రచనలు కొనసాగిస్తూ ఉంటాను.." అని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. శనివారం పట్టిసీమ వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో పర్యాటకంగా మరిన్ని కొత్త అందాలు ఇక్కడ పుట్టుకొస్తాయని అన్నారు. గోదావరి అందాలు, గోదావరి వాసుల అనుబంధాలు మాటల్లో చెప్పలేమని అన్నారు

కమ్మేసిన పొగ మంచు



ఆచంట, ఫిబ్రవరి 3: శనివారం ఉదయం 8 గంటలు దాటినా మంచు వీడలేదు. దట్టంగా కమ్మేసిన పొగమంచు కారణంగా పలువురు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారులు కూడా కనిపించని పరిస్థితి. దీంతో ఉదయం స్కూలు వ్యాన్‌లు, వివిధ ప్రాంతాలకు వెళ్ళే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులుగా ఉదయం వేళ పొగ మంచు, మధ్యాహ్నం ఎండ, ఉక్కబోత వాతావరణం ఉంటున్నది.

రబీ గట్టెక్కేనా ?

రేపటి నుంచి ఏప్రిల్ 9 వరకు వంతుల వారీ నీటి విడుదల



వెంకయ్య వయ్యేరు కాల్వ

భీమవరం, ఫిబ్రవరి 3 : మొన్నటి వర్షాకాలంలో తగినంత వానలు కురవక పోవడంతో ప్రస్తుత రబీ పంట కాలానికి వంతుల వారీగా సాగునీటి నీటి సరఫరా తప్పలేదు. ఈ వర్షాకాలం మొత్తం మీద 57 శాతం మాత్రమే వానలు కురవడంతో గోదావరిలో నీటి లభ్యత తగ్గిపోయింది. దీంతో రబీ పంట ఎలా గట్టెక్కుతుందా అన్న ఆందోళన రైతుల్లో వ్యక్తం అవుతోంది. గత ఏడాది నవంబర్ నెలలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో సాగునీటి సరఫరా కష్టాల గురించి చర్చించారు. వంతుల వారీ నీటి సరఫరాకు నిర్ణయించారు. ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభించి వచ్చే ఏప్రిల్ 9 వరకు రెండు విభాగాలుగా సాగునీరు అందించాలని టైం టేబుల్ రూపొం దించారు. జిల్లాలో జలవనరుల శాఖ డివిజన్లు వారీగా వాటి పరిధిలో ఉన్న కాలువలకు సాగునీరు టైం టేబుల్ ప్రకారం విడుదల చేయనున్నారు.

జిల్లాలో 2 లక్షల 41 వేల ఎకరాలకు..

జిల్లాలో ప్రస్తుతం రబీ పంట 2.41 లక్షల ఎకరాలలో సాగు చేశారు. ధవలేశ్వరం బ్యారేజీ నుంచి పశ్చిమ డెల్టాకు రోజువారీగా 6,500 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలి. సీలేరు నుంచి అదనంగా 13 వేల క్యూసెక్కుల నీరు వస్తే తప్ప రెండో పంటకాలలో పూర్తిగా నీరందే పరిస్థితి లేదు దీంతో వంతులవారీ విధానం తీసుకొచ్చారు. ప్రస్తుతం గోదావరి పశ్చిమ డెల్టా ఆయకట్టులోని కాలువలకు 5,500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఈ వారంలో మరింతగా నీటి సరఫరా తగ్గిపోయే అవకాశం ఉంది. ఈనెల 5 నుంచి వంతులవారీ విధానం ప్రారంభించిన తర్వాత రోజు వారీగా 2500 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేస్తారు. ఇలా రెండు నెలలు పాటు సాగునీరు సర్దుబాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలో తణుకు, నరసాపురం, ఉండి సబ్ డివిజన్లోని కాలువల ద్వారా ఈ నీరు విడుదల చేస్తున్నారు.

వంతులవారీ ఇలా..

జలవనరుల శాఖ ఉండి డివిజన్ పరిధిలో వెంకయ్య వయ్యేరు కాలువ ఆయకట్టులో 75,113 ఎకరాలకు సాగునీరు అందించాలి. ఉండి కాలువ ఆయకట్టులో 41,151 ఎకరాలు, వెంకయ్య వయ్యేరు కాలువ ఆయకట్టులో 33,962 ఎకరాలు ఉన్నాయి. ఉండి పరిధిలో భీమవరం ,కాళ్ల ,పాలకోడేరు, ఉండి, గణపవరం మండలాలు ఉన్నాయి. ఇక్కడ ఉన్న భూములకు ఈనెల 5 తేదీ ఉదయం 6 గంటల నుంచి 11వ తేదీ ఉదయం 6 గంటల వరకు నీరు వదులుతారు. 18వ తేదీ నుంచి 24 ఉదయం 6 గంటల వరకు, మార్చి 2 ఉదయం 6 నుంచి 6వ తేదీ ఉదయం వరకు, మార్చి 15వ ఉదయం నుంచి 21 వ తేదీ ఉదయం వరకు, మార్చి 28 ఉదయం 6 గంటల నుంచి ఏప్రిల్ 3 తేదీ ఉదయం వరకు సాగునీరు సరఫరా అవుతుంది.

వెంకయ్యరు కాలువ పరిధిలో గణపవరం, పెంటపాడు, నిడమర్రు, ఆకివీడు, కాళ్ళ మండలాలు ఉన్నాయి. వీటకి ఫిబ్రవరి 11 తేదీ సాయంత్రం ఆరు గంటలు నుంచి 17వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు నీరు వదులుతారు. 24 సాయంత్రం నుంచి మార్చి 1 సాయంత్రం వరకు, 8తేదీ నుంచి 14 సాయంత్రం వరకు, 21వ తేదీ సాయంత్రం నుంచి 27 సాయంత్రం వరకు, ఏప్రిల్ నెల 3 తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 9 సాయంత్రం 6 గంటలు వరకు వరకు సాగునీరు విడుదలవుతుంది.

జగన్ పాలనలో రైతులకు అన్నీ కష్టాలే

రైతు పోరుబాటలో ఎమ్మెల్యే రామానాయుడు

పోడూరు/ యలమంచిలి, ఫిబ్రవరి, 3 : జగన్ పాలనలో రైతులు పడ్డ కష్టాలు అన్ని ఇన్నీ కావని రైతులను పలకరిస్తే ఈ ఐదేళ్లలో వారు మోసపోయిన తీరును, వారి పడ్డ కష్టాలను వింటుంటే చాలా బాధేస్తోందని ఎమ్మెల్యే రామానాయుడు అన్నారు. రైతులతో, టీడీపీ, జనసేన శ్రేణులతో పాలకొల్లు నియోజకవర్గంలో శనివారం రెండోరోజు రైతు పోరుబాట పాదయాత్ర నిర్వహించారు. మట్టపర్రు, పెనుమదం, రావిపాడు, నేరేడుమిల్లి, మేడపాడు, ఆర్యపేట, యలమంచిలి గ్రామాల్లో నిర్వహించిన యాత్రలో రోడ్డు పొడవునా వందలాది మంది రైతులు స్వచ్ఛందంగా పాల్గొని వారి కష్టాలను, వివరించి వాపోయారు. మహిళలు హారతులు ఇచ్చారు. రావిపాడు గ్రామంలో చేల్లో దిగి కూలీలతో కలిసి వారినారు తీశారు. అసెంబ్లీ సమావేశంలో రైతు సమస్యలపై గళం విప్పుతానన్నారు. టీడీపీ, జనసేన నాయకులు పెచ్చెట్టి బాబు, శిద్దిరెడ్డి అప్పారావు, పెన్మెత్స రామభద్రరాజు ,రాచకొండ విశ్వనాధం, తానేటి బాబూరావు, మానేపల్లి శ్రీధర్, నరసింహారావు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, పితాని వెంకట్, కడలి ఆంజనేయులు, దేవరపు దొరబాబు తదితరులు పాల్గొన్నారు. యలమంచిలి శివారు గొలేపర చెర్వుగట్టు ప్రాంతంలో ఆయన రాత్రి బస చేసి ఆదివారం ఆఖరి రోజు పోరుబాటు నిర్వహించనున్నారు.



రైతులు, టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి రైతు పోరుబాట యాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామానాయుడు



కార్యక్రమంలో పాల్గొన్న నిట్ ఆచార్యులు ...అలరించిన విద్యార్థుల ప్రదర్శనలు

ఉద్యోగాల సాధనకు నైపుణ్యాలే కీలకం

ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 3 : కొలువుల సాధనకు సాంకేతిక నైపుణ్యాలే కీలకమని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఉల్కాన్ జీ సాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్త్ యువతారానిదేనని, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే నూతన ఆవిష్కరణల రూపకల్పనకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ , కృత్రిమ మేదస్సు , క్లౌడ్ కంప్యూటరింగ్ తదితర ఆధునిక సాంకేతిక అంశాలపై పట్టుసాధించిన విద్యార్థులకు ప్రముఖ కంపనీలు రెడ్ కార్పెట్ పరిచి ఉద్యోగాలకు ఆహ్వానిస్తున్నాయన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.డీన్‌లు డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, డాక్టర్ టీ.కురుమయ్య, డాక్టర్ ఎస్.జయరాం, డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి, ఆచార్యులు సందీప్, రమేష్, శంకర్, సంతోష్, రేష్మ, సౌమ్య పాల్గొన్నారు.

పచ్చని పొలాల మధ్య అక్రమ ఆక్వా చెరువులు

కన్నెత్తి చూడని అధికారులు



ఆకివీడు, ఫిబ్రవరి 3: కాంటూరు పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా ఆక్వా చెరువు తవ్వుతున్నారు. ఆకివీడు సమతానగర్ ఏరియాల్లో కాంటూరు పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా సుమారు తొమ్మిది ఎకరాల్లో రెండు రోజులుగా ట్రాక్టర్లతో తవ్వుతున్నారు. కాంటూరు పక్కనే జిరాయితీ సుమారు రెండు ఎకరాలకు అనుమతులు పెట్టుకొని అంతకు మించి తవ్వకాలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఆక్వా చెరువుల నీరు మురుగు కాల్వలోకి వదలకుండా పంట బోదెల్లోకి వదులుతుండడంతో పచ్చని పంట పొలాలు చౌడు బారిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి కాంటూరులో తవ్వకాలు నిలుపుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 3: సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని జిల్లా నుంచి 26 మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేయగా కృష్ణా, తూర్పు గోదావరి జిల్లా నుంచి ఈ జిల్లాకు 25 మంది బదిలీపై వచ్చారు. వీరిలో 23 మంది ఎంపీడీవోలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మండలాలను కేటాయిస్తూ పోస్టింగ్ ఆర్డర్లను జడ్పీ సీఈవో సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రస్తుత జిల్లా	పేరు	మండలం
కృష్ణా	జి.సుధాప్రవీణ్	బుట్టాయిగూడెం
తూర్పుగోదావరి	డీఎల్ఎస్ శర్మ	ఉంగుటూరు
తూర్పుగోదావరి	జి.శివరామకృష్ణయ్య	నిడమర్రు
తూర్పుగోదావరి	బి.అశోక్‌కుమార్	కుక్కునూరు
కృష్ణా	వి.రాంబాబు	లింగపాలెం
కృష్ణా	జె.స్వర్ణభారతి	కామవరపుకోట
కృష్ణా	కె.జోగేశ్వరరావు	టి.నరసాపురం
కృష్ణా	సీహెచ్ చినరత్నాలు	చింతలపూడి
కృష్ణా	ఏపీ రమణ	పెదవేగి
కృష్ణా	టి.స్వర్ణలత	భీమడోలు
తూర్పుగోదావరి	బీకెఎస్ఎస్ వెంకటరత్నం	భీమవరం
తూర్పుగోదావరి	కడలి పద్మజ్యోతి	ఇరగవరం
తూర్పుగోదావరి	మట్టపర్తి అనుపమ	పాలకొల్లు
తూర్పుగోదావరి	డి.శ్రీలలిత	తణుకు
తూర్పుగోదావరి	ఎస్.సుబ్రహ్మణ్య శర్మ	తాడేపల్లిగూడెం
కృష్ణా	పి.శ్రీనివాసరావు	యలమంచిలి
కృష్ణా	టి.అనూహ్య	పాలకోడేరు
కృష్ణా	వై.రామకృష్ణ	ఆకివీడు
తూర్పుగోదావరి	ఎన్.బొజ్జి	చాగల్లు
తూర్పుగోదావరి	కె.నరేంద్రరెడ్డి	ఉండ్రాజవరం
తూర్పుగోదావరి	కె.హిమామహేశ్వరి	పెరవలి
తూర్పుగోదావరి	కేపీ ఝాన్సీ	నిడదవోలు
తూర్పుగోదావరి	పీఎస్ నరేష్‌కుమార్	నల్లజర్ల

కళకళలాడిన శ్రీవారి క్షేత్రం



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 3: ద్వారకా తిరుమల ఏడు కొండలవాని సన్నిధి శనివారం భక్తజనులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. దీంతో అన్ని విభాగాలు సందడిగా మారాయి. దాదాపు 15 వేల మంది వరకూ ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది. దర్శనానంతరం ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

విద్యుత్ వాహనాలకు రాయితీ

భీమవరం క్రైం, ఫిబ్రవరి 3 : రాష్ట్రంలో కాలుష్యం అంతకంతకూ తీవ్రంగా మారుతున్న పరిస్థితుల్లో నియంత్రణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని దృక్పథంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ వాహనాలకు రాయితీ ఇచ్చి ప్రజలను ప్రోత్సహిస్తుందని జిల్లా రవాణాశాఖ అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ బైక్‌లు, కార్లకు గత ఏడాది జూన్ 7వ తేదీ వరకు రాయితీ అమల్లో ఉందని 2024 జూన్ 7 వరకు వరకు రాయితీని రాష్ట్రప్రభుత్వం మరలా అమలులోకి తీసుకువచ్చిందన్నారు.

క్రైం కార్నర్

యువకుడు అదృశ్యం..చించినాడ బ్రిడ్జిపై బైక్

యలమంచిలి, ఫిబ్రవరి 3: మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన తమ్ము అశ్వినికుమార్ శనివారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.శివన్నారాయణ తెలిపారు. గోదావరిలో చేపలవేట చేస్తూ అశ్వినికుమార్ జీవనం సాగిస్తుంటాడు. శనివారం వేకువజామున ఇంటివద్ద నుంచి బయలుదేరి చించినాడ వద్ద గోదావరిలో వేటకు వెళుతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. ప్రతిరోజూ మధ్యాహ్నం సమయానికి ఇంటికి చేరుకునే అశ్వినికుమార్ సాయంత్రం అయినా తిరిగిరాకపోవడంతో అతని కుటుంబసభ్యులు చించినాడ పరిసరాల్లో ఆచూకీ కోసం వెతుకుతుండగా చించినాడ బ్రిడ్జిపై అతని బైక్ ఉంది. చుట్టుపక్కల గాలించగా యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు. సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుని ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 3 : మద్యం మత్తులో ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని తూర్పు వీధికు చెందిన బూసి దినేష్ (18) అల్లరి చిల్లరగా తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతూ ఉంటాడు. అతిగా మద్యం తాగిన అతను శుక్రవారం ఇంట్లో పడుకున్న అతను తెల్లవారేటప్పటికి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 3: తాడేపల్లిగూడెం రెండో ఫ్లైఓవర్‌పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. కడకట్లకు చెందిన కె.గంగాభవాణి, జి.రమాదేవిలు అక్కాచెల్లెల్లు. వారు బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై హౌసింగ్‌బోర్డు కాలనీకి వెళ్లి వస్తూండగా లారీ ఢీకొట్టింది. దీంతో గంగాభవాణి, రమాదేవిలు కిందపడిపోయారు. వారిని 108 వాహనంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గంగాభవాణి పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసినట్టు ఎస్సై సుధాకరరెడ్డి తెలిపారు.

పోలవరంలో చైన్ స్నాచింగ్ కలకలం

పోలవరం, ఫిబ్రవరి 3 : పోలవరం అంజనేయస్వామి గుడి వీధిలో చైన్ స్నాచింగ్ శనివారం సాయంత్రం కలవరం రేపింది. ఆలయం సమీపంలో కిరాణా వ్యాపారం నిర్వహిస్తున్న మహిళ వద్దకు ఇద్దరు అగంతకులు వచ్చి డ్రింక్స్ అడిగారు. ఆమె మెడలో బంగారు చైన్ తెంపుకుపోవడానికి ప్రయత్నించారు. ఆ మహిళ చైన్ చేతితో గట్టిగా పట్టుకోవడంతో చైన్ తెగిపోయింది. సగం చైనుతో దుండగులు బైకుపై పలాయనం చిత్తగించారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. కొన్ని రోజుల క్రితం గ్రామంలో ఇదే తరహాలో బంగారానికి మెరుగుపెడతామని మత్తుమందు జల్లి దుండగులు బంగారంతో ఉడాయించారు. దీంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదం..చికిత్స పొందుతూ పోడూరు ఎంపీపీ భర్త మృతి



పోడూరు, ఫిబ్రవరి, 3 : పోడూరు మండలం కవిటం శివారు నల్లవెంకయ్య చెర్వుకు చెందిన మండల పరిషత్ అధ్యక్షురాలు సబ్బితి సుమంగళి భర్త సబ్బితి విద్యాసాగర్ (51) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. గత నెల 19న విజయవాడలో జరిగిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా గన్నవరం సమీపంలో మూత్ర విసర్జనకు బస్సు దిగి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఆయనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యాసాగర్ తలకు బలమైన గాయం తగిలింది. దీంతో ఆయనను విజయవాడ ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ఆసుపత్రికి వెళ్లి సందర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు. అప్పటి నుంచీ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందారు. భార్య , ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేధిస్తున్నాడంటూ భర్తపై ఫిర్యాదు

ఆకివీడు, ఫిబ్రవరి 3: పెళ్ళయిన దగ్గర నుంచి తన భర్త తనను చిత్రహింసలకు గురిచేస్తున్నాడని భార్య ఫిర్యాదు మేర ఎస్‌ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక పెద్దపల్లివీధికి చెందిన కొల్లాటి సత్తిబాబుకు 18 ఏళ్ళ క్రితం భాగ్యలక్ష్మినిచ్చి పెళ్ళి చేశారు. తాను తెచ్చిన డబ్బులు కూడా తాగి చిత్రహింసలకు గురిచేస్తున్నాడని శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

వాహనాల ఢీ.. ఒకరికి గాయాలు

ఆకివీడు, ఫిబ్రవరి 3: కోళ్ళపర్రులో ఆటోలు ఎదురెదురు ఢీకొన్నాయి. ఆటో డ్రైవర్ దారపురెడ్డి ప్రసాద్‌కు గాయాలవ్వగా భీమవరం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం ఫిర్యాదు మేర ఎస్‌ఐ బత్తిన నాగబాబు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ నుంచి తరలిస్తున్న సిమెంటు పట్టివేత

చింతలపూడి,ఫిబ్రవరి 3: చింతలపూడి మండలం రాఘవాపురం హైస్కూల్ నుంచి అక్రమంగా తరలిస్తున్న 35 సిమెంటు బస్తాలను గ్రామస్తులు, వైసీపీ నాయకులు గిరి భోగారావు పట్టుకుని జిల్లా విద్యా శాఖాధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నాడు-నేడు పథకంలో భవన నిర్మాణానికి ఉపయోగించే 35 బస్తాల సిమెంటును హైస్కూల్ హెచ్ఎం రామ కృష్ణ ఒక తాపీమేస్త్రికి విక్రయించారని, వాటిని తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. దీనిపై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. నాడు-నేడు మండల విద్యాశాఖాధికారి కిరణ్‌బాబును దీనిపై ప్రశ్నించగా దీనిపై ఫిర్యాదు వచ్చిందని విచారణ చేస్తున్నట్టు తెలిపారు.

సింగగూడెంలో చోరీ

లింగపాలెం, ఫిబ్రవరి 3: లింగపాలెం మండలం సింగగూడెం గ్రామంలో దొంగతనం జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. సింగగూడెం గ్రామానికి చెందిన పామర్తి సుబ్బారావు శుక్రవారం విజయవాడలోని తన బంధువుల ఇంటికి వెళ్ళి శనివారం తిరిగి రాగా తలుపులు పగులకొట్టి ఉన్నట్లు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, క్లూస్‌టీమ్‌తో కలిసి వేలిముద్రలు సేకరించారు. రెండుకాసుల బంగారపు చైను, వెండి వస్తువులు పోయినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెన్నారావు తెలిపారు.

కోర్టుకు తీసుకువచ్చిన దొంగలు పరార్

ఇద్దరు ఎస్కార్ట్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 3 : కోర్టుకు హాజరు పరిచేందుకు తీసుకు వచ్చిన ఇద్దరు దొంగలు కోర్టు ఆవరణ నుంచే పరారైన ఘటన ఏలూరు జిల్లాలో చోటు చేసుకుంది. అంతర్‌రాష్ట్ర దొంగలు ఇద్దరిని పీటీ వారెంట్‌పై ఏలూరు త్రీటౌన్ పోలీసులు శనివారం జిల్లా జైలు నుంచి తీసుకువచ్చి ఏలూరు కోర్టులో హాజరు పరుస్తుండగా కోర్టు నుంచి పరారయ్యారు. తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి మండలం రామానగరానికి చెందిన నీలాల అనిల్ కుమార్ (20), మంచిర్యాల జిల్లా మందమర్రి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ భీమిలి రాజ్‌కుమార్ (20) దొంగతనాలకు పాల్పడుతుండేవారు. మిర్యాలగూడ సబ్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సమయంలో వీరిద్దరూ స్నేహితులయ్యారు. ఏలూరు పరిధిలో రెండు మోటారు సైకిళ్ల చోరీ కేసుల్లో వీరిపై వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి. వారిని మిర్యాలగూడ జైలు నుంచి ప్రత్యేక ఎస్కార్ట్‌తో ఏలూరు తీసుకు వచ్చి కోర్టు ముందు హాజరుపర్చగా వారికి రిమాండ్ విధించడంతో ఏలూరు జైలులో ఉన్నారు. ఏలూరులో గతేడాది డిసెంబరు 20న వట్లూరు హాస్టల్ వద్ద మోటారు సైకిల్ అపహరించుకు పోవడంతో ఏలూరు త్రీటౌన్ పోలీ సులు జనవరి 12వ తేదీన కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి పీటీ వారెంట్ త్రీటౌన్ పోలీసులు కోర్టులో వేయగా కోర్టు అనుమతించడంతో ఏలూరు జిల్లా జైలులో ఉన్న ఇద్దరు దొంగలను కోర్టుకు హాజరుపర్చేందుకు త్రీటౌన్ కానిస్టేబుళ్ళు ఇద్దరు శనివారం ఉదయం వారిని కోర్టుకు తీసుకువచ్చారు. మధ్యాహ్నం 1 సమయంలో వారిద్దరు కోర్టు ఆవరణ నుంచి ఆకస్మాత్తుగా చెరోవైపు పారిపోయారు. ఐటీడీఎ వైపు ఉన్న గోడలు దూకి డీఈవో కార్యాలయం వైపు నుంచి పరారయ్యారు. ఎస్కార్ట్‌గా ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్ళ పరుగుపెట్టినా ఫలితం లేకుండా పోయింది.



ఈ గోడ దూకే పారిపోయారు.. పరారైన దొంగలు వీరే

కానిస్టేబుళ్లు సస్పెన్షన్

ముద్దాయిలను కోర్టులో హాజరుపర్చడంలో అలసత్వం ప్రదర్శించారంటూ ఇద్దరు కానిస్టేబుళ్లను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. సాధారణంగా ఒక దొంగను కోర్టుకు హాజరు పర్చాలంటే ఇద్దరు పోలీసులు వెళ్ళాల్సి ఉంది. ఇద్దరిని హాజరుపర్చాలంటే ఇద్దరు కానిస్టేబుళ్ళు,ఒక హెడ్ కానిస్టేబుల్‌ను ఎస్కార్ట్‌గా నియమిస్తారు. శుక్రవారం ఏలూరు కోర్టులో హాజరుపరిచేందుకు వన్‌టౌన్ పోలీసులు ఐదుగురు వెళ్లారు, వీరికి బేడీలు వేసి కోర్టుకు తీసుకువచ్చారు. కోర్టులో హాజరుపర్చిన తరువాత తిరిగి జిల్లా జైలుకు అప్పగించారు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు ఎస్కార్ట్ ఏర్పాటు చేయడంలో వైఫల్యం చెందారని చెప్పవచ్చు.కేవలం ఇద్దరు కానిస్టేబుళ్ళను పంపించి స్టేషన్ అధికారులు చేతులు దులిపేసుకున్నారు.నిబంధనలు పాటించకుండా ఆ ఇద్దరు కానిస్టేబుళ్ళను బలి చేశారని విమర్శలు వస్తున్నాయి.

పోలవరం సరిహద్దుల్లో పులి సంచారం

భయాందోళనలలో ప్రజానీకం

పోలవరం, ఫిబ్రవరి 3 : పోలవరం మండల సరిహద్దు గ్రామాలైన ఎల్లండీపేట సమీప గ్రామాలైన కరకపాడు అడవుల్లోకి పులి వచ్చి తిరుగుతున్నట్లుగా అటవీశాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో శనివారం ఎల్లండీ పేట, సరిహద్దు గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అటవీ క్షేత్రాధికారి దావీదు రాజు మాట్లాడుతూ అటవీశాఖ సిబ్బంది పులి కదలికలపై నిఘా పెట్టారని, ఎక్కడికక్కడ ట్రాప్ కెమెరాలు పెట్టామన్నారు. పులి తిరిగి పాపికొండల అభయారణ్యంలోకి వెళ్ళే దిశగా ఉందని అన్నారు. ప్రస్తుతానికి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం కరకపాడు పరిధిలోని అడవిలో సంచరిస్తున్నదని అటవీ శాఖ సిబ్బంది తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు రాత్రి సమయాల్లో బయట సంచరించరాదని, పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని టాంటాం ద్వారా ప్రజల్ని హెచ్చరించారు.

సీఎం సభ కోసం పరీక్ష వాయిదాపై ఎస్‌ఎఫ్‌ఐ ఖండన

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 : ముఖ్యమంత్రి సభ కోసం ఇంటర్మీడియట్ పర్యావరణ విద్య పరీక్షను వాయిదావేయడం సిగ్గుమాలిన చర్యఅని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. సంఘ జిల్లా కార్యదర్శి లెనిన్ మాట్లాడుతూ సీఎం సభ జరిగేచోట షాపులను మూసివేయించడం, విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడం ఆనవాయితీగా తయారైందని విమర్శించారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఇంటర్‌బోర్డును వైసీపీ రాజకీయకేంద్రంగా పర్యావరణ విద్య పరీక్షను వాయిదా వేయడంద్వారా తయారు చేశారని ఆరోపించారు. ఎటువంటి కారణాలను తెలపకుండా ఇంటర్ పర్యావరణ విద్య పరీక్షను వాయిదా వేస్తూ ఉత్తర్వులివ్వడాన్ని ఎస్‌ఎఫ్‌ఐ ఖండిస్తోందన్నారు.

హైస్కూల్ టీచర్లకు ఐసీటీ అవగాహన తరగతులు


శిక్షణలో సూచనలు చేస్తోన్న సమగ్రశిక్ష ఏఎంవో రామారావు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 : ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ), విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌ల ద్వారా పాఠ్యాంశాల బోధనపై సైన్స్, గణితం సబ్జెక్టుల ఉపాధ్యాయులకు సమగ్ర కంప్యూటర్ శిక్షణ(ఐసీటీ)తరగతులను శనివారం నిర్వహించారు. ఏలూరులో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ కో-ఆర్డినేటర్ రెడ్డి రామారావు ప్రారంభించారు. నగరంలోని సుబ్బమ్మ దేవి మున్సిపల్ హైస్కూలులో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉచితంగా లభించే దీక్షా యాప్, విద్యాసంబంధిత యాప్‌ల వినియోగంపై ప్రస్తుతం జిల్లాస్థాయిలో శిక్షణ పొందుతున్న రిసోర్స్‌పర్సన్లందరూ వాటిపై క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులందరికీ పూర్తి అవగాహనవచ్చేలా ప్రాక్టీస్ చేయించాలన్నారు. ఈనెల 5 వరకు కొనసాగే శిక్షణ కార్యక్రమాలు జిల్లాలో ఏలూరుతోపాటు నూజివీడు, జంగారెడ్డిగూడెంలలో ఎంపికచేసిన ప్రభుత్వ ఉన్నతపాఠశాలల్లో జరుగుతాయని వివరించారు. కోర్సు కో-ఆర్డినేటర్లు డీ.వీ.రమణ, కృష్ణప్రసాద్, ఏఎల్‌ఎస్ కో-ఆర్డినేటర్ రాధాకృష్ణ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై ఆర్డీవో పర్యవేక్షణ


సుప్రియన్‌పేట సచివాలయాన్ని సందర్శించిన ఆర్డీవో భవాని శంకరి

చింతలపూడి, ఫిబ్రవరి 3 : చింతలపూడిలోని సుప్రియన్‌పేట సచివాలయం, పాత చింతలపూడిలోని సచివాలయాల్లో భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియను నూజివీడు ఆర్డీవో భవాని శంకరి పర్యవేక్షించారు. సచివాలయ సిబ్బంది, సబ్ రిజిస్ట్రార్ శ్యాం నాగేశ్వరరావుతో కలసి శనివారం ఆమె పరిశీలించారు. ఈ ప్రకియ ఏ విధంగా జరుగుతుంది, ఎన్ని జరిగాయనే వివరాలు తెలుసుకున్నారు. రెవెన్యూ సిబ్బంది షకీలున్నీసా, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్యాన్సర్ వస్తే భయపడవద్దు


మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్‌కుమార్‌యాదవ్

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 3 : క్యాన్సర్ వస్తే భయపడవద్దని సకాలంలో గుర్తిస్తే నివారించవచ్చని వంగాయగూడెం గుడ్ సమరిటన్ క్యాన్సర్ ఆసుపత్రి రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ మనోజ్‌కుమార్‌యాదవ్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్‌డే సందర్భంగా శనివారం ఆసుపత్రి ప్రాంగణంలో సర్జికల్ అంకాలజిస్ట్ కె.చంద్రశేఖర్, ఎం.డి. జనరల్ మెడిసిన్ డాక్టర్ ఎం.రాజ్యలక్ష్మితో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ రోగులు గణనీయంగా పెరుగుతున్నారన్నారు. దీన్ని నివారించాలంటే వ్యాయామంతో పాటు మంచి ఆహారం, కంటినిండా నిద్ర, పర్సనల్ హైజీన్, మెడిటేషన్ ద్వారా నివారించవచ్చన్నారు. ప్రతి ఏడాది ఒకసారి స్క్రీనింగ్ టెస్టులు చేసుకోవడం ద్వారా క్యాన్సర్ ఉన్నది ? లేనిది ? గుర్తించవచ్చన్నారు. గుడ్ సమరిటన్ ఆసుపత్రిలో క్యాన్సర్‌కు మెరుగైన వైద్యం అందజేస్తున్నామన్నారు.

'రైతులపై ప్రభుత్వ నిరంకుశ వైఖరి తగదు'

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 3: రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశవైఖరి ప్రదర్శించడం తగదని బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కుమారస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కిసాన్ మోర్చ కార్యవర్గ సమావేశం జిల్లా కార్యాలయంలో శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులను దారుణంగా మోసం చేసిందన్నారు. రైతాంగ సమస్యలపై బీజేపీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కీర్తి రామ్‌ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిషోర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి, కొడూరి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌ను నిరసిస్తూ నగరంలో ర్యాలీ

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 3 : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పట్ల రైతులు, కార్మికులు సామాన్యప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించలేదంటూ కార్మిక రైతాంగ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. పలువురు నాయకులు జూట్ మిల్లు, అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి మరిన్ని నిధులు పెంచాలని, పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయించాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను తీవ్రంగా నిరాశపరిచిందన్నారు. ఎరువుల సబ్సిడీ తగ్గించడం వల్ల ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, డీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సోమయ్య, శ్రీనివాస్ డాంగే, ఎం.కృష్ణ చైతన్య నాయకత్వం వహించారు.

కొయ్యలగూడెంలో జబర్దస్త్ టీం సందడి


కొయ్యలగూడెంలో జబర్దస్త్ టీమ్ సందడి

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 3:సినీ గాయకులతో కూడిన జబర్దస్త్ టీం కొయ్యలగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. శనివారం కన్నాపురం, కొయ్యలగూడెం, పొంగుటూరు, బయ్యన్నగూడెం గ్రామాల్లో జబర్దస్త్ టీఎం సందడి చేసింది. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను తపనా ఫౌండేషన్ ద్వారా ప్రచారం చేశారు. తమదైన హాస్యప్రదర్శనతో ప్రజలను ఆకట్టుకున్నారు. బీజేపీ నాయకులు నిర్మలకిషోర్, ముడియం శ్రీనివాసరావు, కట్టా సత్యనారాయణ, కొండేపాటి రామకృష్ణ, వంకా కాంచనమాల తదితరులు పాల్గొన్నారు.


కామవరపుకోటలో పూజిత సంతాప సభ నిర్వహిస్తున్న ఉద్యోగులు

'వైసీపీ వేధింపులకు పూజిత బలి'

కామవరపుకోట, ఫిబ్రవరి 3 : బాపట్ల జిల్లా వేమూరు మండలం చావలి రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయశాఖ సహాయకురాలిగా పనిచేస్తున్న డి.పూజితను వైసీపీ నాయకులు, ఉన్నతాధికారులు వేధించడం వల్ల పూజిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని రైతు భరోసా కేంద్రం అధికార ఉద్యోగులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్‌బీకే ప్రాంగణంలో పూజిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూజితను వేధించిన ఉద్యోగులు, వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా కేంద్రంలో వైసీపీ నాయకులు ఎరువులు తీసుకుని డబ్బులు చెల్లించకపోవడం వల్ల ఆ డబ్బులు చెల్లించాలని పూజితను అధికారులు వేధించడం, గిడ్డంగిలో వర్షానికి తడిసిన ఎరువుల బస్తాలకు నష్టం జరిగిందని, ఆ డబ్బులు కూడా చెల్లించాలనే వేధింపులు తాళలేక ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని స్పష్టం చేశారు.

రా..కదలి రా సభకు తరలి రావాలి

టీడీపీ సమావేశాల్లో నాయకుల పిలుపు


పోలవరంలో ఆళ్ల గోవిందుడిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పోలవరం, ఫిబ్రవరి 3 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయకత్వంలో సోమవారం చింతలపూడిలో నిర్వహించే 'రా కదలి రా' సభకు టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు, అభిమానులు కదలి రావాలని టీడీపీ సీనియర్ నాయకుడు కుంచే దొరబాబు పిలుపునిచ్చారు. శనివారం పోలవరం టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు నివాసం వద్ద మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ఆళ్ల గోవిందుకి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న రాక్షస పాలన పోయి చంద్రన్న పాలన వచ్చే రోజులు దగ్గరకు వచ్చాయన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రన్న గెలుపు కోసం ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా పని చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పాపోలు గణపతి రత్తయ్య, మండల నాయకులు మంగిన కొండ, సున్నం సుదీర్ రాజు, యడ్ల వినోద్, నునకాని రాంబాబు, పోతుల శ్రీను, పిల్లి నాగరాజు, సబ్బారపు శ్రీరామ్మూర్తి, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం, ఫిబ్రవరి 3: చింతలపూడిలో నిర్వహించే రా కదిలిరా! భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని లింగపాలెం మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గరిమళ్ళ చలపతిరావు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్నిగ్రామాల అధ్యక్షులు, పలు కమిటీల్లో పనిచేసే నాయకులు, కార్యకర్తలందరూ సభకు విచ్చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి తెలుగుదేశంపార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేయాలన్నారు.

● టి.నరసాపురం, ఫిబ్రవరి 3 : చింతలపూడిలో చంద్రబాబు సభను జయప్రదం చేయాలని కోరుతూ టి.నరసాపురం విజయలక్ష్మి థియేటర్ వద్ద టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. జగన్మోహనరెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలన్నా, రాష్ట్రం సర్వతోముఖాభి వృద్ధి చెందాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని చింతలపూడి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు జయ్యవరపు శ్రీరామమ్మూర్తి, శీలం వెంకటేశ్వరరావు, పోలవరం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి చిర్రి బాల రాజు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, నల్లూరి వెంకట చలపతిరావు, తోట లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి మోహన్‌రావు, నాయుడు రామకృష్ణారావుగౌడ్, అడపా నాగరాజు, ఆచంట సూర్యనారాయణ, బొంతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి టీడీపీ : చింతమనేని


చింతమనేనిని కలిసిన నాయీ బ్రాహ్మణ నాయకులు

పెదవేగి, ఫిబ్రవరి 3 : టీడీపీ బీసీల పక్షపాతి అని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు నియోజకవర్గం నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ నూతన కార్యవర్గం నాయకులు దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ బీసీలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించి, వారికి అన్నివిధాల అండగా నిలిచిన పార్టీ టీడీపీ అన్నారు. వైసీపీ పాలనలో బీసీలు మోసపోవడమే కాకుండా దాడులకు సైతం గురయ్యారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయంతో సంక్షేమ పాలన తిరిగొస్తుందని, బీసీ సాధికారత సాధ్యపడుతుందన్నారు. తొలుత నూతనంగా ఎన్నికైనా కమిటీ సభ్యులకు ప్రభాకర్ నియామక పత్రాలను అందించి, అభినందించారు. టీడీపీ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ వైద్యం శాంతారామ్, ఏలూరు జిల్లా కన్వీనర్ కొప్పెర్ల నాగరాజు, దావీదు, అన్నవరపు రామకృష్ణ, దొండపాటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన నారాయణపురం గ్రామస్థులు

ఉంగుటూరు, ఫిబ్రవరి 3 : నారాయణపురం గ్రామంలో సర్పంచ్ దిడ్ల అలకనంద, గ్రామ పార్టీ అధ్యక్షుడు సప్పా వీరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు విజయకుమార్, నల్లా ఆనంద్, గురువెల్లి రాజారావు, ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు శనివారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో చేబ్రోలు, తల్లాపురం సర్పంచ్‌లు రాందే లక్ష్మీ సునీత, పసుపులేటి నరసింహారావు, బొమ్మిడి అప్పారావు, పాతూరి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.


నారాయణపురంలో పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న గన్ని తదితరులు


విద్యార్థులను, తల్లిదండ్రులను సత్కరిస్తున్న సిబ్బంది

శ్రీచైతన్యలో ప్రతిభకు పట్టం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 3: విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి, వారిని అత్యున్నత స్థానాలకు చేర్చడమే శ్రీచైతన్య ప్రథమ లక్ష్యమని విద్యానగర్ శ్రీచైతన్య ఒలింపియాడ్ స్కూల్ ప్రిన్సిపాల్ వేమూరి లిల్లీషా తెలిపారు. గత ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన రాష్ట్రస్థాయి ర్యాంకర్లకు శనివారం ప్రత్యేక అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎస్.తన్విత (597-600), కె.బ్లెస్సీ సాత్విక (596-600)లను, వీరి తల్లిదండ్రులు వెంకటకృష్ణారెడ్డి, జ్యోతి దంపతులు కె.దొరబాబు, శారదాకుమారి దంపతులను, అధ్యాపకులను శ్రీ చైతన్య యాజమాన్యం తరపున ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా విద్యాసంస్థల ఏజీఎం సుంకర పార్థసారధి, రీజనల్ ఇన్‌చార్జి సీహెచ్ ఉదయభాస్కర్, జోనల్ అకాడమిక్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, అకాడమిక్ డీన్ కేవీ లక్ష్మణ్‌కుమార్, ప్రైమరీ ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి యశోదారూన్సీ లక్ష్మీబాయి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లు పబ్లిక్ సర్వెంట్‌లా ? పార్టీ ప్రచారకులా ?

పోలవరం, ఫిబ్రవరి 3 : పబ్లిక్ సర్వెంట్లుగా పని చేయాల్సిన వలంటీర్లతో వైసీపీ ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంపై టీడీపీ సీనియర్ నాయకుడు కుంచే దొరబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఏలూరులో జరిగిన సీఎం సభ కోసం పోలవరం మండలంలో వలంటీర్లందరినీ స్థానిక ఎంపీపీ పట్టిసీమ శివక్షేత్రం ఇసుక తిన్నెల్లోకి పిలిపించి వైసీపీ టోపీలు, జెండాలతో మండుటెండలో పార్టీ ప్రచార వీడియోలు తీయడాన్ని ఆయన ఖండించారు. మహిళలకు పెద్దపీట అని చెప్పిన సీఎం జగన్ మహిళా వలంటీర్లను ఈవిధంగా పార్టీ ప్రచారాల కోసం వేధించమని చెప్పారా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు బొడ్డు కృష్ణ, పాపోలు రత్తయ్య, మంగిన కొండ, పోతుల శ్రీను, యడ్ల వినోద్, పిల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'డాక్టర్ సుధాకర్ సేవలు ఎనలేనివి'

పోలవరం, ఫిబ్రవరి 3 : విశ్రాంత వైద్యులు డాక్టర్ జీవీజీకే సుధాకర్ మండలంలో అందించిన వైద్య సేవలు ఎనలేనివని, ఆయన లేని లోటు తీర్చలేనిదని టీడీపీ మండల నాయకులు మంగిన కొండ అన్నారు. శనివారం డాక్టర్ కుటుంబ సభ్యులను కలిసి సంతాపం తెలిపారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, వైసీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కొణతాల ప్రసాద్, అధ్యక్షులు గొంతి వేణు, సీపీఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు, సీపీఐ కార్యదర్శి జేవీ నరసింహారవు, కరిబండి నాగరాజు, తదితరులు సంతాపం తెలిపారు.

దోబీ మహా సంఘటన్ మండల అధ్యక్షుడిగా ప్రసాద్

ఉంగుటూరు, ఫిబ్రవరి 3 : ఉంగుటూరు మండల అఖిల భారత దోబీ మహా సంఘటన్ మండల అధ్యక్షుడిగా గొల్లగూడెం గ్రామానికి చెందిన పిప్పర ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్రకార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిల్లెల శ్రీరామమ్మూర్తి, జొన్నాడ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి : జెట్టి


మాట్లాడుతున్న జెట్టి గురునాథరావు

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 3 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులంతా అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ చైర్మన్ జట్టి గురునాదరావు పిలుపునిచ్చారు. శనివారం కొయ్యలగూడెంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ వైఎస్ షర్మిల పీసీసీ పగ్గాలు చేపట్టాక రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీస్తుందన్నారు. మళ్ళీ కాంగ్రెస్‌పార్టీకి పూర్వపు వైభవం వచ్చిందన్నారు. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. పలు పార్టీల్లో ఉన్న పార్టీ నేతలందరినీ మళ్ళీ కాంగ్రెస్ గూటికి చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీకృష్ణ, మండల అధ్యక్షుడు జుంగా బాబ్జీ, కూనపం రాజారత్నం, పోతురాజు, ముప్పిడి శ్రీను, తోట వెంకటేశ్వరరావు, నక్కా బాబీ పాల్గొన్నారు.

కులగణనలో తప్పులు సరిచేసిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 3 : కులగణన సర్వేలో తప్పులు శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఉదయ్‌భాస్కర్ కాలనీలో క్షేత్రస్థాయిలోసమస్య పరిష్కరించేందుకు డీఎల్‌డీవో ఎం.రాజు చర్యలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు వీరలక్ష్మీ, ప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటి పేరు తప్పు పడినవారి వేలి ముద్ర వేయించారు. కొందరివి కులగణన సర్వే సమయంలో సర్వర్ వల్ల ఇబ్బందులు వచ్చాయని వాటి సరి చేసినట్టు అధికారులు తెలిపారు. సర్వే పూర్తి బాధ్యత వలంటీర్లపై నెట్టటం సరికాదని సాంకేతిక లోపాల్ని సరిచేసేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరి అరెస్ట్

లింగపాలెం, ఫిబ్రవరి 3: మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్‌ఐ చెన్నారావు తెలిపారు. శనివారం ధర్మాజీగూడెంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వీరిపై కేసునమోదు చేశామన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ. 3.08 లక్షల అవినీతి

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 3 :ఉపాధిహామీ పథకంలో 2022-23 సంవత్సరానికి సంబంధించి జరిగిన పనులపై ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజా వేదిక నిర్వహించారు. డ్వామా పీడీ ఎ.రాము ఆధ్వర్యంలో శనివారం పనుల్లో జరిగిన అవకతవకలను రూ.3.08 లక్షల అవినీతి జరిగినట్టు అధికారులు గుర్తించారు. జీలుగుమిల్లి తాటియాకులగూడెం పంచాతీల్లో ఎక్కువ శాతం అవకతవకలు జరిగినట్టు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌లు అవినీతికి పాల్పడినట్టు అధికారులు గుర్తించారు. ఆ శాఖ ఇతర అధికారుల్ని అందుకు కొంత బాధ్యత వహించాల్సి ఉందన్నారు. కారణమైన వారిని బాధ్యుల్ని చేస్తూ వారి నుంచి కొంత నగదు రికవరీ చేయాలన్నారు. రికవరీలో జాప్యం జరిగితే సహించేది లేదని విచారణ అధికారులు తెలిపారు. జిల్లా విజిలెన్స్ అధికారి ఎవి.విజయలక్ష్మి, ఏపీడీ దామోదరావు, ఎస్ఆర్‌పీ రామచంద్రరావు, ఎంపీడీవో ఎంవి.మంగతాయారు, ఏపీవోలు శ్రీదేవి, జాన్‌వెస్లీ, టెక్నికల్ అసిస్టెంట్‌లు సీహెచ్.రవికుమార్, ప్రసన్నరాజు ఉన్నారు.

ఇంటింటి ప్రచారానికి జనసేన శ్రీకారం


ప్రజలతో మాట్లాడుతున్న రెడ్డి అప్పలనాయుడు

ఏలూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 3 : జనసేన పార్టీ విధానాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో జనసేన-టీడీపీ కూటమికి విజయం చేకూర్చాలంటూ జన సైనికులు శనివారం నగరంలోని పలు డివిజన్లలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ తమ కూటమిలో భాగస్వామ్యమైన తెలుగుదేశం రూపొందించిన మేనిఫెస్టోలో ఉన్న హామీల వల్ల ప్రతీ కుటుంబానికి ప్రయోజనం కలుగుతుందన్నారు. జగన్ పాలన పోవాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. గత టీడీపీ పాలనలో 80 శాతం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లను నాలుగున్నరేళ్లలో వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు అందించలేకపోయిందన్నారు.

వెహికల్ డ్రైవర్‌గా మాజీ మంత్రి నాని


బస్సు నడుపుతున్న మాజీ మంత్రి పేర్ని నాని

ఏలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సమీపంలో జరిగిన ముఖ్యమంత్రి సిద్ధం బహిరంగ సభకు మాజీ మంత్రి పేర్ని నాని తన నియోజకవర్గ ప్రజలను బస్సులో ఎక్కించుకుని స్వయంగా బస్సు నడుపుతూ తీసుకొచ్చారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కామెంట్లు చేస్తున్నారు. రవాణా మంత్రి కాస్త మాజీ కాగానే వెహికల్ డ్రైవర్ అయ్యారని సోషల్‌మీడియాలో కామెంట్లు గుప్పిస్తున్నారు. ఈ వీడియోతో ఫొటోలు కూడా నెట్టింట వైరల్ అవుతున్నాయి.

'కేంద్రం పనితీరును ప్రజలకు వివరించాలి'

జంగారెడ్డిగూడెం/కామవరపుకోట, ఫిబ్రవరి 3 : ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వం పనితీరును వివరించాలని బీజేపీ జిల్లా కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి కోరారు. బీజేపీ మండల సమావేశం అధ్యక్షుడు పారేపల్లి వీరవెంకట సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి నియమించబడిన కన్వీనర్, కో కన్వీనర్లు గ్రామంలో ప్రజలతో మమేకమై మోదీ సారథ్యంలో చేస్తున్న పనితీరును వివరించాలన్నారు. చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ ఒంటెద్దు యేసు వర ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శులు మానేపల్లి రామారావు, తుమ్మలపల్లి బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు. కామవరపుకోట మండలం పోలాసిగూడెంలో పల్లెకు పోదాం కార్యక్రమం బీజేపీ జిల్లా కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు కొప్పాక శ్రీనివాసరావు, మానేపల్లి రామారావు, బ్రహ్మాజీ శాస్త్రి, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగమంచులో వాహనాల వేగం తగ్గించాలి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 3 : పొగమంచులో ప్రయాణించేటప్పుడు వాహనాన్ని వేగం తగ్గించి, హెడ్‌లైట్స్‌ను తక్కువ కాంతి వచ్చే మోడ్లో ఉంచడం, వాహనాల మధ్య సురక్షిత దూరం ఉండే విధంగా చూసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వై.సురేష్‌బాబు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఉపరవాణా కమిషనర్ శాంతకుమారి ఆధ్వర్యంలో శనివారం ఏలూరు పాతబస్టాండ్ వద్ద మ్యాక్సీ క్యాబ్ యూనియన్ డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించినప్పుడే ప్రమాదాలను అరికట్టగలమన్నారు. రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

9న అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 3 :ఇందిరానగర్ కాలనీలో వున్న అభయాంజనేయస్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవం ఈనెల 9న నిర్వహించేందుకు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ నిర్మాణకర్త వలవల తాతాజీ తెలిపారు. ఈమేరకు ఆలయం వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. కేఎల్ఎన్ ధనకుమార్, ఆర్ఎస్ఆర్ రాజు, పెదవేగి రాంబాబు, మద్దిపాటి శ్రీను, గుర్రం వీరబాబు, కొత్తపల్లి నరేష్, కంబాల పండు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి తులసీదళాలతో అర్చన

ఏలూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 3:పుష్యమాసంలోని ఆఖరి శనివారం పురస్కరించుకుని స్థానిక రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామికి, అమ్మవార్లకు భక్తులు సామూహికగా తులసీదళాలు, పుష్పాలతో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులతో పూజలు చేయించారు. భగవద్గీత పారాయణ మండలి సభ్యులు భగవద్గీత విష్ణు సహస్రనామ పారాయణను నిర్వహించారు.

జీలుగుమిల్లి ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 3 : జీలుగుమిల్లి ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వాహకులు రాధా కృష్ణులు ప్రత్యేక అలంకరణ చేశారు. గిరిజన ప్రాంతంలో ఆధ్యాత్మిక భావన పెంచేందుకు సంస్థ పలు పూజా కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్టు టెంపుల్ వ్యవస్థాపకులు మాలినీ మాతాజీ అన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీఎస్. రవి కు మార్, సీహెచ్. దుర్గరాజు, తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ రమణయ్య హత్య దారుణం


రవీంద్రరాజు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 3 : విజయనగరం జిల్లా తహసీల్దార్ రమణయ్య దారుణహత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఖండించారు. రమణయ్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. హత్యకు కారకులను తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధిక భూవివాదాలు ఉన్న మండలాల తహసీల్దార్లకు, వీఆర్వోలకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితాలో తప్పులు జరిగితే విచారణ చేయకుండా వీఆర్వోలను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఒంటిమిట్టలో వీఆర్వోపై అధికార పార్టీ సర్పంచ్ దూషణలకు దిగడం దుర్మార్గమని వారు ఖండించారు.

బుట్టాయగూడెంలో ఆందోళన

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 3 : విశాఖపట్నంలో తహసీల్దార్ రమణయ్య హత్యకు నిరసనగా శనివారం రెవెన్యూ అధికారులు, సిబ్బంది తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. హత్యచేసిన దోషులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.


లింగపాలెంలో రెవెన్యూ సిబ్బంది ఆందోళన

లింగపాలెంలో నల్ల బ్యాడ్జీలతో విధులు

లింగపాలెం, ఫిబ్రవరి 3: లింగపాలెంలో రెవెన్యూ మండల సిబ్బంది నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. తహసీల్దార్ రమణయ్యను కిరాతకంగా హత్యచేసిన దుండగులను పట్టుకుని వెంటనే శిక్షించాలని, రెవెన్యూ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసనలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల బదిలీలు, బాధ్యతలు

లింగపాలెం, ఫిబ్రవరి 3: లింగపాలెం మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలానికి వెళుతున్న ఆర్‌వీ మురళీకృష్ణను రెవిన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కృష్ణాజిల్లా కలిదిండి నుంచి లింగపాలెం మండలం ఎంపీడీవోగా ఒరుదు రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోను మండల పరిషత్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు.


లింగపాలెంలో తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఎంపీడీవోగా సుధాప్రవీణ్ బాధ్యతలు స్వీకరణ

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 3:బుట్టాయగూడెం ఎంపీడీవోగా జి.సుధాప్రవీణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా ముప్వ మండలం నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురుకు బదిలీపై వెళ్లారు.

పెదవేగి ఎంపీడీవోగా వెంకట రమణ

పెదవేగి, ఫిబ్రవరి 3 : పెదవేగి ఎంపీడీవోగా ఎ.వెంకటరమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా గుడివాడ ఎంపీడీవోగా పనిచేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా పెదవేగి ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఇప్పటివరకు పెదవేగి ఎంపీడీవోగా పనిచేసిన జి.రాజ్‌మనోజ్ తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో వెంకటరమణకు కార్యాలయ పరిపాలనాధికారి కేవీ జాన్సన్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

టి.నరసాపురం ఎంపీడీవోగా జోగేశ్వరరావు

టి.నరసాపురం, ఫిబ్రవరి 3:టి.నరసాపురం నూతన ఎంపీడీవోగా కె.జోగేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా బాపులపాడులో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన మంగాకుమారి బదిలీపై చాట్రాయి వెళ్లారు. మండలంలోని సమస్యలు గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు.



గోతుల పూడ్చివేత

కలిదిండి, ఫిబ్రవరి 3 : మద్వానిగూడెం-కొండంగి రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో అధ్వానంగా మద్వాని గూడెం - కొండంగి రోడ్డు శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మద్వానిగూడెం వంతెన వద్ద ఏర్పడిన గోతుల్లో కంకర వేసి పూడ్చి తారు వేశామని ఆర్అండ్బీ ఏఈఈ అరవింద్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎండీయూ వాహనానికి మరమ్మతులు

ముదినేపల్లి, ఫిబ్రవరి 3 : ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామంలో బియ్యం పంపిణీ చేసే ఎండీయూ వాహనానికి మరమ్మతులు చేపట్టారు. మొండికేసిన ఎండీయు వాహనం శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు వెంటనే వాహనం మరమ్మతు చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 4 నుంచి ఎండీయూ వాహనం ద్వారా ఇంటింటికీ బియ్యం పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్ఐ శివకుమార్ తెలిపారు. వాహనాన్ని కలిదిండిలోని మెకానిక్ షెడ్డుకు తరలించి మరమ్మతులు చేయిస్తున్నారు. కొత్త ఆపరేటర్ లాగిన్లోనే గత మూడు రోజులుగా చౌక డిపో వద్ద బియ్యం పంపిణీ చేస్తున్నట్లు వీఆర్వో సుబ్రహ్మణ్యం తెలిపారు.



దాడికి యత్నిస్తున్నారు..

వైసీపీ నాయకుడిపై జనసేన నాయకుడు 'కొల్లి' ఆరోపణ

కైకలూరు, ఫిబ్రవరి 3: కైకలూరు వైసీపీ నాయకులు తనపై దాడికి యత్నిస్తున్నారని జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్ ఆరోపించారు. శనివారం కైకలూరు పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల తన కారుపై దుండగులు దాడి చేశారని, అలాగే ఈ నెల 1న కైకలూరు బైపాస్ రోడ్డులో తాను జనసేన నాయకులతో మాట్లాడుతుండగా వైసీపీకి చెందిన వ్యక్తి తనతో కావాలనే గొడవకు దిగాడని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు. అలాగే కొల్లేటికోటలో తన ఇంటి కూల్చివేతకు యత్నించగా కోర్టు ద్వారా ఆపుకున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు వల్ల తనకు హాని ఉందని అనేకసార్లు తనపై వైసీపీ రౌడీలను పంపిస్తున్నారని ఆరోపించారు. జనసేన నాయకురాలు తోట లక్ష్మి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కైకలూరు వారపు సంత వద్ద పంచాయతీ దుకాణాల్లో తమ వ్యాపార సంస్థ ఉందని ప్రస్తుతం వేలంలో దానిని తమకు రాకుండా అడ్డుకున్నారన్నారు. తమకు ఏ అన్యాయం జరిగినా కైకలూరు ఎమ్మెల్యేదే బాధ్యత అన్నారు. జనసేన నాయకులు ఉప్పాల సూర్యప్రకాశరావు, శాంతి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేపు ముదినేపల్లి మండల సర్వసభ్య సమావేశం

ముదినేపల్లి, ఫిబ్రవరి 3: ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 5న జరుగుతుందని ఎంపీడీవో ఏఎం గంగాధరరావు తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఆయన తెలిపారు.



పైపులైన్ పనులు చేపట్టిన దృశ్యం

ఎట్టకేలకు జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం

పైప్లైన్ పనులు పర్యవేక్షించిన ఐక్యవేదిక

మండవల్లి, ఫిబ్రవరి 3: ఎట్టకేలకు మండవల్లిలో జలజీవన్ మిషన్ పనులు శనివారం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా మండలంలో ఇంటింటికి కుళాయిలు మంజూరు కానున్నాయి. మండవల్లి గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా రెండేళ్ల క్రితం కేంద్రం నుంచి రూ. 69 లక్షలు మంజూరైనప్పటికీ పంచాయతీ నిర్లక్ష్య వైఖరి కారణంగా పనులు ప్రారంభం కాలేదని గతంలో గ్రామస్థులు నిరసన తెలిపారు. గ్రామసభలోను, స్పందనలోనూ పలుమార్లు పంచాయతీ తీరుపై ఫిర్యాదులు చేశారు. ఇటీవల మండవల్లిలో గ్రామ సభలో కార్యదర్శిని, సర్పంచ్, ప్రజాప్రతినిధులను, సంబంధిత అధికారులను గ్రామస్థులు నిలదీశారు. కాంట్రాక్టరు పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ పంచాయతీ ఎందుకు సహకరించటం లేదని పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఎట్టకేలకు శనివారం జలజీవన్ మిషన్ పైప్లైన్ పనులను చేపట్టారు. పనులను మండవల్లి సర్పంచ్ ఝాన్సీ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండవల్లి శాఖ అధ్యక్షుడు టి. అప్పారావు, పంచాయతీ కార్యదర్శి టి. శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



బేస్మెంట్ దశలో ఉన్న ప్రాకార మండపం

శరవేగంగా ఆలయ ప్రాకార మండప నిర్మాణం

కలిదిండి, ఫిబ్రవరి 3 : కలిదిండిలోని పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ ప్రాకార మండప నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దాతల సహకారంతో సుమారు రూ. 4 కోట్ల వ్యయంతో ఆలయం చుట్టూ దీన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం బేస్మెంట్ దశలో ఉంది. శివరాత్రి నాటికి బేస్మెంట్ నిర్మాణం పూర్తవుతుందని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో క్యూ లైన్లో ఎండలో నిలబడి పలు అవస్థలు పడకుండా సౌకర్యవంతంగా ప్రాకార మండపం ఉంటుందన్నారు. సామూహిక అభిషేకాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చన్నారు. మండప నిర్మాణానికి దాతలు విరాళాలు అందించటం అభినందనీయమన్నారు.

ప్రమాద ఘంటికలు

- అడుగంటిన మంచినీటి చెరువులు
- గ్రామాల్లో దాహం కేకలు
- పూర్తిగా తొలగించని డెక్క, తూడే కారణం
- అటపాకలో రోజు విడిచి రోజు నీటి సరఫరా
- కాలువలకు నీటి విడుదలకు డిమాండ్



అడుగంటిన అటపాక మంచినీటి చెరువు

వేసవి రాకుండానే గ్రామాల్లో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొంది. కాలువల ద్వారా నీటి సరఫరా నెలల తరబడి నిలిపివేయడంతో మంచినీటి చెరువులు అడుగంటాయి. ఇప్పటికే గ్రామాల్లో రోజు విడిచి రోజు, మరికొన్ని గ్రామాల్లో బోర్లపైన నీటిని సరఫరా చేస్తున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలోనే ఇలా ఉంటే రానున్న వేసవిలో తాగేందుకు కూడా నీరు దొరకదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో నీరు అడుగంటడం, ఫిల్టర్ బెడ్లు పనిచేయకపోవడంతో నేరుగా చెరువులోని నీటినే కుళాయిలకు సరఫరా చేస్తున్నారు!

కైకలూరు, ఫిబ్రవరి 3: కైకలూరు మండలం అటపాకలో రోజువిడిచి రోజు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే గోనెపాడులో కొద్దిరోజులుగా బోర్లు ద్వారా నీటిని ట్యాంకులకు అందించి నీటిని విడుదల చేస్తున్నారు. విడుదల చేసే నీరు సమయపాలన లేకపోవడంతో ఏరోజు నీరు వస్తుందో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. కైకలూరులోని భవానమ్మ చెరువులో దట్టంగా గుర్రపు డెక్క పేరుకుపోయింది. అదిలోనే దాని నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో చెరువంతా కమ్మేసింది. మండలంలోని 23 చెరువులు ఉండగా వాటిలో పల్లెవాడ, భుజబలపట్నం, సీతనపల్లి, దొడ్డిపట్ల, వేమవరప్పాడు, వదర్లపాడు, గోపవరం గ్రామాల్లో కూడా మంచినీటి చెరువులు అడుగంటాయి. 10 నుంచి 15 రోజుల వరకు మాత్రమే నీరు అందుతుందని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పేర్కొంటున్నారు. కైకలూరు ప్రాంతమంతా రొయ్యల సాగు ఉండడంతో గ్రామాల్లో ఊటబావులు కలుషితమైపోయాయి. ప్రజలు వాడుకునేందుకు కూడా ఉపయోగించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. జల వనరుల శాఖ అధికారులు త్వరితగతిన కాలువలకు నీరు విడుదల చేయకపోతే గ్రామాల్లో మరింత మంచినీటి ఎద్దడి ఏర్పడుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి త్వరగా కాలువలకు నీటి విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



గుర్రపుడెక్కతో నిండిన కైకలూరు భవానమ్మ చెరువు



చావలిపాడులో అడుగంటిన మంచినీటి చెరువు

చావలిపాడులో తాగునీరు దుర్గంధం

మండవల్లి: మండవల్లి మండలం చావలిపాడులో మంచినీటి చెరువు అడుగంటింది. జనాభాకు సరిపడా చెరువు లేకపోవడం తక్కువ విస్తీర్ణంలో ఉన్న చెరువునే గ్రామంలో మంచినీటి చెరువుగా కొనసాగించడంతో చెరువులో నీటిమట్టం దాదాపు తగ్గింది. దీంతో రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా వంతుల వారీగా అవుతున్నట్టు గ్రామస్థులు తెలిపారు. కాలువల ద్వారా నీరు కూడా సక్రమంగా సరఫరా కాకపోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చెరువులో నీరు అడుగంటి మురికి నీరు వస్తోందని ఇది వాడుకోవడానికి కూడా ఉపయోగపడడం లేదని, తక్షణమే చెరువుకు మంచినీటి సరఫరా చేయాలని కోరుతున్నారు.



కోరుకొల్లులో అడుగంటిన తాగునీటి చెరువు

వాడకానికీ పనికిరావు!

అడుగంటిన నీటి సరఫరా.. కోరుకొల్లు గ్రామంలో తీరిది

కలిదిండి: కోరుకొల్లు తాగునీటి చెరువు అడుగంటడంతో తాగునీటి కోసం ప్రజలు పలు అవస్థలు పడుతున్నారు. చెరువులో నీరు రంగు మారి దుర్వాసన రావటంతో తాగలేకపోతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. ఆర్థిక స్థోమత గల వారు వాటర్ ప్లాంట్ల నుంచి కొనుగోలు చేసి తాగుతుండగా, వృద్ధులు, పేదలు ఆ రంగుమారిన నీరే తాగి అనారోగ్యం పాలవుతున్నారు. అడుగంటిన తాగునీటి చెరువును నింపుదామంటే ఇంతవరకు కాల్వలకు తాగు, సాగునీరు విడుదల చేయలేదని చెరువు ఏ విధంగా నింపాలని సర్పంచ్ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి చెరువు నింపటానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వంతు ఇవ్వకుంటే ఆమరణ దీక్ష



కోరుకొల్లు తాగునీటి చెరువు అడుగంటుతోంది.. తాగునీటి వంతు ఇస్తే చెరువును నింపుకుంటామని ఇరిగేషన్ అధికారులకు విన్నవించగా వంతు ఎప్పుడిస్తామో చెప్పలేమని అంటున్నారు. సకాలంలో తాగునీటి వంతు ఇవ్వకపోతే ఆమరణ దీక్ష చేపడతా.

-లీలా కనకదుర్గ, సర్పంచ్



మునునూరులో మాట్లాడుతున్న ఆళ్ల గోపాలకృష్ణ



తుమ్మగూడెంలో టీడీపీ సమావేశం

రా.. కదలిరా సభను జయప్రదం చేయండి

మునునూరు, ఫిబ్రవరి 3: చింతలపూడిలో ఈ నెల 5న నిర్వహించే రా.. కదలిరా సభను జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం మునునూరులో పార్టీ మండల అధ్యక్షుడు దేవినేని ఢలరాం అధ్యక్షతన ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో చంద్రబాబు ఎంతో దూరదృష్టితో చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూ 4,909 కోట్లు మాంజూరు చేయడమే కాక రూ. 3450కోట్లు ఖర్చు చేసి 80శాతం పనులను పూర్తిచేశార న్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని అటకెక్కించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ-జనసేన ప్రభుత్వాన్ని అధికారంలోకి తెస్తే తప్ప ఈ పథకం పూర్తికాదన్నారు. సభకు రైతులు, టీడీపీ శ్రేణులు వేలాదిగా పాల్గొనేలా నాయకులు కార్యాచరణ సిద్ధం చేసి సభను విజయవంతం చేయాలన్నారు. నాయకులు కందుల పిచ్చియ్య, కొల్లి గంగారామ్, మానం గంటేశ్వరరావు, మానురాజు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: చంద్రబాబు సభకు చాట్రాయి మండలం నుంచి పార్టీ శ్రేణులు అభిమానులు ప్రజలు భారీగా తరలిరావాలని పార్టీ జనసమీకరణ పరిశీలకుడు దొంతు చిన్నా పిలుపునిచ్చారు. తుమ్మగూడెంలో శనివారం మండల అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీసం 10 వేల మంది సభకు తరలిరావాలని, దీనికి మండల, గ్రామ శాఖలు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలు, టీడీపీ కుటుంబ సభ్యులు కలసికట్టుగా కృషి చేసి సభను విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి అధికారంలోకి రావాలని వైసీపీ కుట్ర పన్నుతోందని, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి దానిని తిప్పికొట్టాలన్నారు. తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, నాయకులు మందలపు రాజా, చీకటి చెన్నారావు, ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, మోదుగుమూడి రమేష్, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ముద్దరబోయినకే టికెట్టు ఇవ్వాలి

మునునూరు, ఫిబ్రవరి 3: పదేళ్ళుగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉన్న ముద్దరబోయినకే నూజివీడు టీడీపీ టిక్కెట్టు ఇవ్వాలని పలువురు నాయకులు అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దేవినేని ఢలరాం, ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చియ్య, బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మానురాజు సురేష్, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి గద్దె రఘుబాబు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు తల్లిబోయిన సత్యనారాయణ, సీనియర్ నాయకుడు కొల్లి గంగారామ్ తదితరులు మునునూరులో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న ముద్దరబోయినకు టిక్కెట్ ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. నాయకులు మండలపు బుజ్జియ్య, మానం విజయకుమార్, గారపాటి నరసింహారావు, నక్కా యోహాను, చిన్నం శ్రీను, తోట శ్రీనివాసరావు, రంగు వాసు తదితరులు పాల్గొన్నారు.

అద్వానీకి భారతరత్నపై హర్షం

కైకలూరు, ఫిబ్రవరి 3: మాజీ ఉప ప్రధాని ఎల్కే అద్వానీకి భారతరత్న ప్రకటించడం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అయోధ్య రామమందిర నిర్మాణ కల సాకారానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కైకలూరు అసెంబ్లీ కన్వీనర్ వేంపాటి విష్ణురావు, పార్టీ మండల అధ్యక్షుడు కట్టా వీరరాఘవులు, నాయకులు నంబూరి విజయ నరసింహరాజు, సమయం ఏసుబాబు, సత్యవోలు లక్ష్మి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వెండి తాపడానికి విరాళాలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 3: శింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అంతరాలయ ముఖద్వారానికి వెండి తాపడం నిమిత్తం గుడివాడకు చెందిన వేముల నాగసాయి బాలాజీ దంపతులు రూ.10,116 విరాళం అందించారు. అలాగే గుడివాడకే చెందిన వేముల మణీశ్వర్ రూ.10,116 విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్, ఈవో నేల సంధ్యకు అందించారు.

ఖైదీలకు నాణ్యమైన భోజనం అందించాలి



సబ్ జైలును తనిఖీ చేస్తున్న న్యాయాధికారి కృష్ణయ్య

కైకలూరు, ఫిబ్రవరి 3: జైల్లో ఖైదీలకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కేవీ కృష్ణయ్య అన్నారు. శనివారం కైకలూరు సీనియర్, జూనియర్ న్యాయాధికారులు వీవీ నాగ వెంకటలక్ష్మి, ఎస్ శివకిరణ్ సబ్జైలును తనిఖీ చేశారు. ఖైదీలకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూసి పలు సూచనలు చేశారు. నిర్దేశిత మెనూను అమలు చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం ఖైదీలను ఏయే కేసుల్లో జైలుకు వచ్చిందీ తెలుసుకున్నారు. జైలు అధికారి బి. అప్పారావు, న్యాయవాదులు పి. పవన్కాంత్, పి. ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య.. కట్నం వేధింపులే కారణం?



దుర్గాభవాని (ఫైల్)

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 3: ముదినేపల్లి మండలం ఊటుకూరు గ్రామ శివారు నారాయణపురంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కోన దుర్గాభవాని (22) శుక్రవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని, అదనపు కట్నం వేధింపులే కారణమై ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకట కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న బైక్.. మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 3:నూజివీడు మండలం మిట్టగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం నూజివీడు నుంచి విస్సన్నపేట వెళుతున్న ప్రకాష్ తన ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొన్నాడు. దీంతో వాహనం పై నుంచి ఎగిరిపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నూజివీడులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.



వైసీపీ నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ



టీడీపీ నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

ఫ్లెక్సీ వార్

మునునూరు, ఫిబ్రవరి 3: కాట్రేనిపాడు మెయిన్ సెంటర్లో ఏర్పాటు చేసిన వైసీపీ, టీడీపీ బ్యానర్లపై శనివారం వివాదం చేలరేగింది. వైసీపీ సిద్ధం బ్యానర్లో చంద్రబాబు, పవన్కల్యాణ్ల కార్టూన్లు వేసి, హైదరాబాద్ పారిపోవడానికి మీరు సంసిద్ధమా అని కొటేషన్ వేయడంతో వివాదం రాజుకుంది. అయితే టీడీపీ మేము సంసిద్ధం బ్యానర్లో ఒక్కసారి అని ప్రజలను నమ్మించి రాజధాని లేని రాష్ట్రం చేసి పోలవరం పూర్తి చేయలేని అసమర్థత అనే కొటేషన్ ఉండటంతో స్థానిక వైసీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం తారాస్థాయికి వెళ్ళింది. నూజివీడు రూరల్ ఎస్ఐ ఆర్. మల్లికార్జునరెడ్డి ఇరుపార్టీల నాయకులకు సర్దిచెప్పడంతో బ్యానర్ల తొలగింపునకు వారు అంగీకరించారు. పంచాయతీ కార్యదర్శి జంగం యోహాను, పోలీసులు రెండు పార్టీల బ్యానర్లను తొలగించడంతో వివాదం సద్దుమణిగింది.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 3: నూజివీడు మండలం గొల్లపల్లి రఘునాథ స్వామి ఆలయ ధర్మకర్తలి మండలి నియామకానికి దేవదాయ ధర్మదాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఉప కమిషనర్, దేవదాయ ధర్మాదాయ శాఖ, కాకినాడ నోటిఫికేషన్ జారీ చేశారని, ఈ నెల 21వ తేదీలోపు తమ దరఖాస్తులను ఉప కమిషనర్ కార్యాలయానికి పంపాలని ఆయన తెలిపారు.

ముగిసిన వెబినార్

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 3: నూజివీడు డాక్టర్ ఎమ్మార్ అప్పారావు కాలేజ్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్లో మూడు రోజులుగా స్టాట్ ఇన్ఫర్మేషన్ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, డిపార్ట్మెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆన్లైన్ వెబినార్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ బసవేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలను ఎప్పటికప్పుడు తెలుసుకుని తమను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. స్టాట్ ఇన్ఫర్మేషన్ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ సీఈవో కె.వెంకట రెడ్డి విద్యార్థులకు పవర్ బీఐ పట్ల అవగాహన కల్పించగా కోఆర్డినేటర్ డాక్టర్ సీవీ శాస్త్రి, అధ్యాపకులు కె.అవినాష్, డి.తేజశ్వేత తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఈదర జట్టు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 3: ఆడుదాం ఆంధ్రాలో ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామ వాలీబాల్ జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో కైకలూరు- ఈదర జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో ఈదర జట్టు విజయం సాధించింది. విజేత జట్టు రూ.60 వేలు నగదు, కప్పును కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతులమీదుగా అందుకుంది. త్వరలో విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది.



క్రీడాకారులకు ఆర్డీవో అభినందన

నూజివీడు, ఫిబ్రవరి 3: రాష్ట్రస్థాయిలో నూజివీడు పేరు ప్రతిష్ఠలు నిలపాలని నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి అన్నారు. జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో నూజివీడు నియోజకవర్గం తరపున పలు పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో కూడా నూజివీడు నియోజకవర్గం జట్లు గెలవాలని ఆకాంక్షించారు. ఆడుదాం ఆంధ్రా కో-ఆర్డినేటర్ రవీంద్ర, సబ్ జోన్ సెక్రటరీ సుగుణరావు, ట్రెజరర్ సతీష్, వ్యాయామ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు నాగరాజు, సుకుమార్, ప్రభాకర్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంపన్నులకు మేలు చేసే బడ్జెట్



మునునూరు, ఫిబ్రవరి 3: బీజేపీ సర్కార్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అర్థసత్యాలు, అవకతవకలమయమని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య అన్నారు. శనివారం లిబరేషన్ నాయకులు గుళ్ళపూడిలో బడ్జెట్ నకళ్ళను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల పేదలు, కార్మికులకు ఒరిగేదేమీ లేదన్నారు. ఉపాధి పథకాన్ని నీరుగార్చేలా కేటాయింపులు ఉన్నాయని, ఈ బడ్జెట్ సంపన్నులకు మేలు చేకూర్చేలా ఉందని బక్కయ్య విమర్శించారు. అఖిల భారత కిసాన్ మహాసభ మండల అధ్యక్షులు పామర్తి రామారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీని ఏర్పాటు చేయండి



మునునూరు, ఫిబ్రవరి 3: రమణక్కపేట పంచాయతీ 6వ వార్డులోని అంతర్గత రహదారికి డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఎంపీడీవో పద్మావతిదేవికి స్థానికులు రంగు శ్రీనివాసరావు, ఆర్.మల్లేశ్వరరావు, ఉలాస సుబ్బారావు, ఆరుముళ్ళ వెంకటేశ్వరరావు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైనేజీ లేకపోడంతో మురుగునీరు రహదారిపై ప్రవహిస్తోందని, దోమల ఉధృతి పెరిగి పలువురు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తే, ముందుగా డ్రైనేజీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు.